# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 2 | సంచిక : 199 | ఎడిటర్ : వి. శ్రీనివాసరావు | పేజీలు :8 | శనివారం 11 అక్టోబర్ 2025




## టెక్స్ టైల్స్ రంగంలో పెట్టుబడులతో రండి

### కూటమి ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహం అందిస్తుంది

### అమెల్ సి ఆల్ట్ కన్సార్టియం ప్రతినిధులతో మంత్రి సవిత

**అమరావతి**

రాష్ట్రంలో టెక్స్ టైల్స్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. టెక్స్ టైల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహమందిస్తోందన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు మంత్రి సవితను శుక్రవారం అమెల్ సి ఆల్ట్ కన్సార్టియం ప్రతినిధులు కలిశారు. హిందూపురంలోని ఇంటిగ్రేటెడ్ టెక్స్ టైల్స్ పార్క్ లో పెట్టుబడులకు ఆసక్తిచూపుతున్నట్లు - మిగతా3లో

## పోర్టులు.. ఎయిర్ పోర్టులతో


# ఆర్థికాభివృద్ధి

- ఇథనాల్ ప్లాంట్లతో పర్యావరణానికి మేలు
- పశు పోషణతో పాడి రైతులకు లబ్ధి
- విశ్వసముద్ర గ్రూప్ కు చెందిన వివిధ ప్రాజెక్టులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ”నెల్లూరు జిల్లాలో ఇప్పుడు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టులతో పాటు.. కీలక పరిశ్రమలు వచ్చాయి
- కష్ణపట్నం, రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులు జిల్లా అభివద్ధికి కీలకంగా మారతాయి.



**నెల్లూరు**

పోర్టులు, ఎయిర్ పోర్టులతో రాష్ట్రం ఆర్థికాభివద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని ఈదగాలి గ్రామంలో విశ్వసముద్ర గ్రూపునకు చెందిన వివిధ ప్రాజెక్టులను శుక్రవారం సీఎం ప్రారంభించారు. ఇథనాల్ ప్లాంట్, నంద గోకులం లైఫ్ స్కూల్, సేవ్ ద బుల్, పవర్ ఆఫ్ బుల్ ప్రాజెక్టులను సీఎం ప్రారంభించి.. పరిశీలించారు. నంద గోకులం లైఫ్ స్కూల్ విద్యార్థులతో చంద్రబాబు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ”నెల్లూరు జిల్లాలో ఇప్పుడు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టులతో పాటు.. కీలక పరిశ్రమలు వచ్చాయి. కష్ణపట్నం, రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులు జిల్లా అభివద్ధికి కీలకంగా మారతాయి. దగదర్తి విమానాశ్రయం త్వరలోనే వస్తుంది. - మిగతా3లో



## జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హెూదాపై పిటిషన్లు

- కేంద్రానికి 'సుప్రీం' కీలక ఆదేశాలు..!
- పిటిషన్లపై స్పందన చెప్పాలంటూ కేంద్రానికి నాలుగు వారాల గడువు
- 2023 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీ మేరకు త్వరగా రాష్ట్ర హెూదాను పునరుద్ధరించాలని పిటిషన్లు

## ఏపీలో రూ. 1,27,181 కోట్ల విలువైన ప్రాజెక్టులకు

# కేబినెట్ ఆమోదం

- 78,771 ఉద్యోగాల ఎంపికకూ గ్రీన్ సిగ్నల్
- అనంతపురం జిల్లా టేకులోడులో ఏరోస్పేస్ తయారీ పరిశ్రమ ఏర్పాటు
- టేకులోడులో ఏరోస్పేస్ – ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ పరిశ్రమల స్థాపనకు ఆమోదం
- ఈ ప్రాజెక్టులు మొత్తం 5,800 కోట్ల రూపాయల పెట్టుబడి లక్ష్యంగా 6,646 మందికి ఉపాధి అవకాశాలు 56,353 ఉద్యోగ అవకాశాల కల్పన లక్ష్యంగా 8,186 కోట్ల రూపాయల పెట్టుబడులను అవకాశం కల్పిస్తూ ఈ కేటాయింపులు



**అమరావతి**

రాష్ట్రంలో రూ. 1,27,181 కోట్ల విలువైన ప్రాజెక్టులు, 78,771 ఉద్యోగాల భర్తీకి ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు నిర్ణయాలను తీసుకున్నారు. ఆ వివరాలను సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. అనకాపల్లి జిల్లాలో అధునాతన కార్బన్ కాంప్లెక్స్ తయారీ, పలనాడు జిల్లాలో సిమెంట్ ప్లాంట్ మరియు గుడిపల్లి, అనంతపురం జిల్లా టేకులోడులో ఏరోస్పేస్ – ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ పరిశ్రమల స్థాపనకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులు మొత్తం 5,800 కోట్ల రూపాయల పెట్టుబడి లక్ష్యంగా - మిగతా3లో



## పిల్లలపై ఒత్తిడి పెరుగుతోంది

- నేటి పోటీ ప్రపంచంలో చాలా మంది ఒత్తిడిని తట్టుకోలేక పోతున్నారు
- విద్యార్థుల ప్రతిభను మించి వారిపై ఒత్తిడి చేస్తున్నారు
- తల్లిదండ్రులు ఆలోచనల్లో కూడా మార్పు రావాలి
- మానసిక వ్యాధులతో బాధ పడేవారి సంఖ్య పెరుగుతోంది
- మన దేశంలో 15 కోట్ల మంది మానసిక ఇబ్బందులతో బాధ పడుతున్నారు
- సమాజంపై కూడా వీరి ప్రభావం చాలా ఉంది




## త్వరలో దేశవ్యాప్తంగా 'సర్'

- వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం
- స్థానిక ఎన్నికలు, ఎన్నికలు జరుగనున్న, జరుగుతున్న రాష్ట్రాల్లో స్పెషల్ డ్రైవ్
- ఎన్నికల యంత్రాంగం స్థానిక సంస్థల ఎన్నికలతో బిజీగా ఉందని.. దాంతో సర్‌పై దృష్టి పెట్టలేం
- వచ్చే ఏడాది అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే.



## లొంగిపోయిన మావోయిస్టు లీడర్లు

- కుంకటి వెంకటయ్య, మొగిలిచర్ల వెంకట్రాజు, తోడెం గంగ లొంగిపోయినట్లు డీజీపీ వెల్లడి
- సైద్ధాంతిక విభేదాల కారణంగా పోలీసులు ఇచ్చిన పిలుపుతో లొంగిపోయారన్న డీజీపీ
- ఇటీవలి కాలంలో 403 మంది మావోయిస్టులు లొగిపోయారని వెల్లడి

## 'అప్పుడు రూ. 99లకే "క్వార్టర్" ఇప్పుడు 99 పైసలకే ఎకరం భూమి'

- మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చెయ్యాలనే దుర్మార్గపు ఆలోచన
- వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు
- గత ప్రభుత్వంలో 17 కళాశాలల్ని తీసుకువచ్చి ..ఐదు కళాశాలల్లో అడ్మిషన్లు పూర్తి చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్



**కాకినాడ**

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చెయ్యాలనే దుర్మార్గపు ఆలోచన చంద్రబాబు చేశారని ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు విమర్శించారు. ఈరోజు( శుక్రవారం, అక్టోబర్ 10) కాకినాడలో వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణ ఉద్యమ పోస్టర్‌ను - మిగతా3లో

# మచాడోకు 2025 నోబెల్ శాంతి బహుమతి

## వెనిజులా ప్రజల హక్కుల కోసం పోరాడినందుకు పురస్కారం

**న్యూఢిల్లీ :** మారియా కారినా మచాడోకు 2025 నోబెల్ శాంతి బహుమతి - వెనిజువెలా ప్రజల హక్కుల కోసం పోరాడినందుకు పురస్కారం నార్వే నోబెల్ కమిటీ 2025 నోబెల్ శాంతి బహుమతిని మారియా కారినా మచాడోకు ఇచ్చింది. వెనిజువెలా ప్రజల హక్కుల కోసం డిక్టేటర్‌షిప్‌నకు వ్యతిరేకంగా న్యాయమైన, శాంతియుత పోరాటానికి గుర్తుగా ఈ పురస్కారం లభించింది. దక్షిణ అమెరికా దేశం వెనిజులాలో నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా, ప్రజల ప్రజాస్వామిక హక్కుల పునరుద్ధరణ కోసం నిరంతరం పోరాడుతున్న ప్రముఖ ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడోకు నోబెల్ శాంతి బహుమతి లభించింది. నార్వేజియన్ నోబెల్ కమిటీ చేసిన ఈ ప్రకటన యావత్ లాటిన్ అమెరికాలోని ప్రజాస్వామిక పోరాటాలకు గొప్ప ప్రేరణగా నిలిచింది. ప్రజాస్వామ్యం నుంచి నియంతృత్వానికి జరుగుతున్న పరివర్తనలో న్యాయమైన, శాంతియుత మార్పు కోసం ఆమె చూపిన నిబద్ధత, ఆమె పోరాట స్ఫూర్తిని గుర్తిస్తూ ఈ చారిత్రాత్మక గౌరవాన్ని ప్రకటించారు.ఒక ఇంజనీర్‌గా ప్రజాజీవితాన్ని మొదలు పెట్టిన మారియా కొరినా మచాడో నిరంకుశత్వానికి సవాలు విసిరారు. 58 ఏళ్ల మారియా కొరినా మచాడో కేవలం రాజకీయ నాయకురాలు మాత్రమే కాదు. వెనిజులాలో ప్రజాస్వామ్యం పట్ల ఆమెకున్న అపారమైన నిబద్ధత కారణంగా ఆమె దేశ రాజకీయాల్లో "వెనిజులా ఐరన్ లేడీ"గా సుస్థిర స్థానాన్ని సంపాదించారు. మచాడో రాజకీయ ప్రయాణం 2002లో స్టార్ట్ అయ్యింది. ఆ సంవత్సరంలో ఆమె "సూమతే" అనే ఎన్నికల పర్యవేక్షణ సంస్థను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆమె నికోలస్ మదురో పాలనకు వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఆమె రాజకీయాలలోకి వచ్చిన దశాబ్దకాలంలోనే ప్రజల మద్దతు కూడగట్టారు. 2010లో ఆమె రికార్డు స్థాయి ఓట్లతో జాతీయ అసెంబ్లీ సభ్యురాలిగా ఎన్నికై, 2011 నుంచి 2014 మధ్య కాలంలో వెనిజులా జాతీయ అసెంబ్లీలో ఉన్నారు. 2012



అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేసినప్పటికీ ఓడిపోయారు.క్లిష్ట పరిస్థితుల్లో ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడమే మచాడోకు ఉన్న ప్రత్యేకత. 2023లో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో అద్భుతమైన విజయం లభించింది. ఏకంగా 92% ఓట్లతో ప్రతిపక్షాల తరపున అధ్యక్ష అభ్యర్థిగా గెలుపొందారు. అయితే, నిరంకుశ పాలన ఆమెకు వచ్చిన ప్రజాదరణ చూసి వణికిపోయింది. అంతే కుట్రలు మొదలయ్యాయి. 2023లోనే కంట్రోలర్ జనరల్ ద్వారా మచాడోను 15 ఏళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హురాలిగా ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని 2024 జనవరిలో సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. దీంతో 2024 అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేసే అవకాశం కోల్పోయారు. అక్కడితో ఆగిపోలేదు. ఆమె దేశంలో కూడా ఉండేందుకు అర్హురాలు కాదని కూడా నిషేధం విధించారు. ఇన్ని వేధింపులు వస్తున్నప్పటికీ మచాడో తన పంథాను వదులుకోలేదు. పోరాటంలో వెనక్కి తగ్గలేదు. తన తరపున ఎడ్ముండో గొంజాలెజ్‌ఉర్రుటియాను ప్రతిపక్షాల తరపున అధ్యక్ష అభ్యర్థిగా పోటీకి పెట్టారు. అయితే పరిస్థితిని ముందే గమనించిన మదురో 28 జులై, 2024లో తన విజయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఇది చెల్లదని ప్రతిపక్షాలు ఆందోళనబాట పట్టాయి. ఆ తర్వాత మచాడో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఎన్ని నిర్బంధాలు ఉన్నా ఎన్ని విధాలుగా ప్రభుత్వం ఇబ్బందులు పెట్టిన తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రజల హక్కుల కోసం పోరాటం చేశారు మచాడో. అందుకే ఆమెకు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించారు. నిర్బంధంలో కూడా వెనక్కి తగ్గని స్వభావానికి ప్రపంచ అత్యున్నత పురస్కారం వరించింది. ప్రజల కోసం పలు మార్లు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. మదురో పాలన వెనుజులాకు మాత్రమే కాకుండా దానికి ఆనుకొని ఉన్న అన్ని దేశాలకు పెను ముప్పుగా ఆమె అభివర్ణిస్తూ వచ్చారు. అయితే ఎప్పుడు కూడా ఆమె ప్రపంచ దేశాల మద్ధతు కోరలేదు. కానీ ప్రజాస్వామ్య పాలన కోసం పని చేయాలని మాత్రమే కోరుతున్నారు. ఏ ప్రజాస్వామ్య దేశానికైనా తమ నిర్ణయాలు తాము తీసుకునే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలని కోరుతుంటున్నారు. నోబెల్ శాంతి బహుమతి ప్రకటనకు ముందే ఆమెకు చాలా అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి. కౌన్సిల్ ఆఫ్ యూరప్ 2024లో వాక్లవ్ హావెల్ మానవ హక్కుల పురస్కారం ఇచ్చింది. అదే ఏడాది సఖరోవ్ బహుమతిని ఎడ్ముండో గొంజాలెజ్‌తో కలిసి అందుకున్నారు. 2019లో లిబరల్ ఇంటర్నేషనల్ ఫ్రీడమ్ ప్రైజ్ దక్కింది. 2018లో బీబీసీ ప్రకటించిన 100 అత్యంత ప్రభావవం తమైన మహిళల జాబితాలో చోటు దక్కించుకున్నారు. బహుమతి గ్రహీతలకు మూడు ప్రధాన గుర్తింపులు అందుతాయి. వినూత్న కళాత్మకతతో రూపొందించిన నోబెల్ డిప్లొమా, ప్రత్యేక రూపకల్పనతో కూడిన నోబెల్ పతకం, 10 మిలియన్ స్వీడిష్ క్రోనా (సుమారు రూ. 7.3 కోట్లు) నగదు బహుమతి ఇస్తారు. ఒకరి కంటే ఎక్కువ మంది విజేతలు ఉన్నప్పుడు, ఈ నగదు బహుమతి వారందరి మధ్య సమానంగా పంచుతారు. నోబెల్ బహుమతికి మచాడోను ఎవరు నామినేట్ చేశారు?చాడో నోబెల్ శాంతి బహుమతికి ఇన్‌స్పిరా అమెరికా పౌండేషన్ నామినేట్ చేసింది. నాలుగు యూనివర్శిటీల రెక్టర్లతో కలిసి 2024 ఆగస్టు 16న నామినేట్ చేసింది. ఫ్లోరిడా నుంచి యూఎస్ లెజిస్లేటర్లు దీనికి మద్ధతు ప్రకటిస్తూ ఆగస్టు 26న లేఖ రాశారు.

# భారత్-పాక్‌తోపాటూ మొత్తం ఎనిమిది యుద్ధాలు ఆపా

**తనకు నోబెల్ బహుమతి రావాలి డొనాల్డ్ ట్రంప్**

**న్యూ ఢిల్లీ :** ప్రతిష్టాత్మకంగా భావించే నోబెల్ శాంతి బహుమతి కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తహతహలాడిపోతున్నారు. నోబెల్ శాంతి బహుమతి విజేతను నోబెల్ కమిటి శుక్రవారం మధ్యాహ్నం ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్‌కు టెన్షన్ పట్టుకుంది. ఈ ప్రతిష్టాత్మక అవార్డు తనకు వస్తుందో..? రాదో..? అన్న భయంతో నిద్రకూడా పట్టనట్లు కనిపిస్తోంది.తాను భారత్-పాక్‌తోపాటూ మొత్తం ఎనిమిది యుద్ధాలు ఆపానని అందుకు గానూ తనకు నోబెల్ బహుమతి రావాలని కోరుకుంటున్నారు. తనను తాను పీస్ ప్రెసిడెంట్ అని చెప్పుకుంటూ తిరుగుతున్నారు. నేడు నోబెల్ శాంతి ప్రకటన నేపథ్యంలో తాజాగా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా పై తన అక్కసు వెళ్లగక్కారు. ఒబామా ఏమీ చేయకపోయినా తనకు నోబెల్ శాంతి ఇచ్చారని.. ఎనిమిది యుద్ధాలు ఆపిన తనకు వస్తుందో, రాదో తెలియడం లేదంటూ ఆవేదన వ్యక్తంచేశారు.వైట్‌హౌస్ వద్ద విలేకరులతో ట్రంప్ మాట్లాడుతూ.. గాజాలో శాంతికి మధ్యవర్తిత్వం వహించడంతో సహా తాను ఎనిమిది యుద్ధాలు ఆపడంలో విజయం సాధించానంటూ చెప్పుకొచ్చారు. ఇక ఒబామాకు నోబెల్ శాంతి లభించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు.



'అతను (ఒబామాను ఉద్దేశిస్తూ) ఏమీ చేయలేదు. అయినా ఆ బహుమతి పొందారు. అది ఎందుకిచ్చారో అతనికి కూడా తెలియదు. యూఎస్‌ను నాశనం చేసినందుకే ఆయనకు ఆ బహుమతిని ఇచ్చారు. నేను ఎనిమిది యుద్ధాలను ఆపాను. అయినా వారు ఏం చేయలేదు. నేనేమీ శాంతి బహుమతి కోసం ఇదంతా చేయలేదు. ప్రజల ప్రాణాలను కాపాడి, ప్రంపచవ్యాప్తంగా శాంతిని నెలకొల్పేందుకే చేశాను' అంటూ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ట్రంప్ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.కాగా, అమెరికా అధ్యక్షుల్లో ఇప్పటివరకూ నలుగురికి నోబెల్ శాంతి బహుమతి దక్కింది. థియోడోర్ రూస్‌వెల్ట్, వుడ్రో విల్సన్, జిమ్మీ కార్టర్, బరాక్ ఒబామాలను ఈ బహుమతి వరించింది. ఒబామాను 2009లో ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డు దక్కిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ సహకారం పెంపొందించేలా చేయడం, దౌత్యం, అణ్వాయుధ నిర్మూలకు కృషి చేసినందుకుగాను ఆయనకు నోబెల్ శాంతి వరించింది. ఈసారి నోబెల్ శాంతి బహుమతి నామినీల్లో డొనాల్డ్ ట్రంప్ కూడా ఉన్నారు. దీంతో నోబెల్ శాంతి బహుమతి పొందిన అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఉంటాడో? లేదో? మరికొన్ని గంటల్లో తేలనుంది.స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఏటా ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న విషయం తెలిసిందే. 1896లో ఆల్‌ఫ్రెడ్ నెబెల్ మరణించగా.. 1901 నుంచి ఆయన జ్ఞపకార్థం ఆయన ట్రస్ట్ ద్వారా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే వైద్య, భౌతిక, రసాయన శాస్త్రాల్లో నోబెల్ గ్రహీతల పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇవాళ లిటరేచర్‌లో నోబెల్ ప్రకటించింది. ఇక రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ శుక్రవారం నోబెల్ శాంతి పురస్కారాన్ని ప్రకటించనుంది. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజైన డిసెంబర్ 10న విజేతలకు అవార్డులను అందజేస్తారు. ఈ అవార్డు గ్రహీతలకు 11 లక్షల స్వీడిష్ క్రోనర్ (10 లక్షల డాలర్లు) నగదు అందుతుంది.

## శబరిమల అయ్యప్ప ఆలయంలో బంగారం అవకతవకలు..

# కీలక ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు!

ప్రముఖ క్షేత్రమైన శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో గోల్డ్ ట్యాంపరింగ్ ఆరోపణలున్నాయి. ఈ అంశంపై ఆరు వారాల్లోగా దర్యాప్తు చేసి పూర్తి నివేదిక సమర్పించాలని ప్రత్యేక దర్యాప్తు బృందం ను కేరళ హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. 2019లో అయ్యప్ప స్వామి ప్రధాన ఆలయంలో బంగారం తాపడాల పునరుద్ధరణ సమయంలో 4.5 కిలోకులపైగా బంగారం మాయమైనట్లుగా సిట్ విచారణ లో వెల్లడైంది. ఈ నేపథ్యంలో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. దేవస్థానం సైడ్ ఫ్రేముల్లోని బంగారం లెక్కల్లో అవకతవకలు జరిగినట్లుగా సిట్ తేల్చింది. బంగారం లెక్కల్లో తేడాలు ఉన్నట్లుగా విజిలెన్స్ నివేదికలోనూ ఉందని హైకోర్టు పేర్కొంది. విజిలెన్స్ నివేదికను ట్రావెన్ కోర్ దేవస్థానం ముందు ఉంచాలని కేరళ హైకోర్టు తెలిపింది. దర్యాప్తు వివరాలను మీడియాకు వెల్లడించకూడదని ఆదేశించింది. బంగారు తాపడం స్పాన్సర్ అయిన ఉన్నికృష్ణన్ పొట్టికి గణనీయమైన మొత్తంలో బంగారం, సుమారు 474.9 గ్రాములు అప్పగించినట్లు విజిలెన్స్ నివేదిక వెల్లడించిందని జస్టిస్ రాజా విజయరాఘవన్ వీ, జస్టిస్ కేవీ జయకుమార్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. దర్యాప్తుకు సంబంధించిన ఎలాంటి సమాచారం లీక్ కాకూడదని ఆదేశించింది. తాత్కాలిక ఉత్తర్వులో డివిజన్ బెంచ్ సిట్ తన నివేదికను సీల్డ్ కవర్‌లో నేరుగా కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. ప్రతి రెండు వారాలకు ఒకసారి కేసు పురోగతికి సంబంధించిన నివేదికను కోర్టు కివ్వాలని చెప్పింది. దర్యాప్తు బృందాన్ని ఇద్దరు అదనపు డీవైఎస్పీలతో పెంచవచ్చని చెప్పింది. ఈ కేసులో కేరళ పోలీస్ బాస్‌ను పార్టీగా చేర్చారు. ఉన్నికృష్ణన్ పాటీ ఈ విషయంపై మీడియాతో మాట్లాడకుండా నిషేధం విధించింది. బంగారం అవకతవకల్లో నిజమైన దోషులను స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తుతో గుర్తించాలని కోర్టు ఆదేశించింది. కేసులో స్వాధీనం చేసుకున్న అన్ని పత్రాలు రిజిస్ట్రార్ వద్ద భద్రపరచాలని చెప్పింది. అయితే, విచారణ



సమయంలో గర్భాలయం ముందు ఉండే ద్వారపాలకుల విగ్రహాలకు బంగారు పూత పూసిన రాగి తాపడాలు ఉండేవని.. వాటిని మరమ్మతుల కోసం తీసుకెళ్లి వచ్చాక బరువు తగ్గినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. విచారణ సందర్భంగా బంగారం లెక్కల్లో అవకతవకలు జరిగినట్లు కనిపిస్తోందని కోర్టు స్పష్టం చేసింది. ఈ బంగారు మాయంపై క్రిమినల్ కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేయాలని రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో ఈ బంగారం మాయం వివాదంపై ఇప్పటికే కోర్టు.. సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సిట్ నెలలోగా రిపోర్ట్ ఇవ్వాలని.. ఆ నివేదికను బహిర్గతం చేయొద్దని ఆదేశాలు జారీ చేసింది. సిట్ చీఫ్ ఎస్పీ ఎస్ శశిధరన్, విజిలెన్స్ ఎస్పీ ఎస్పీ బంగారం అవకతవకలపై తుది నివేదికను సమర్పించారు. ఆ తర్వాత దర్యాప్తుపై స్పష్టత కోసం బెంచ్ విడిగా చర్చలు జరిపింది. వీడీ సతీశన్ ఈ అంశంపై మాట్లాడుతూ తీవ్రమైన పరిస్థితి ఉందని.. బంగారం అవకతవకలు కేవలం తాపడాలకు మాత్రమే పరిమితం కాలేదని.. ఇతర ప్రాంతాలకు విస్తరించిందన్నారు. అసలు ద్వారపాలక శిల్పాలను బయట విక్రయించారని.. వాటి స్థానంలో బంగారు పూతపూసి ఫేక్ రాగి పలకలను ఉంచి చెన్నైకి పంపారని కోర్టు ప్రస్తావించిందని గుర్తు చేశారు. ఈ అంశంలో హైకోర్టు జోక్యానికి ప్రభుత్వానికి అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. అందులో ఎలాంటి సమస్య లేదని.. అక్రమాలను పరిశోధించడానికి హైకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అక్రమాలు జరిగి ఉంటే దోషులను శిక్షిస్తామన్నారు. ప్రభుత్వం, కోర్టుది ఒకే లక్ష్యమన్నారు. వాస్తవానికి శబరిమల ఆలయంలోని ద్వారపాలక విగ్రహాలను మరమ్మతుల కోసం 2019లో తొలగించారు. కొత్త బంగారు తాపడాలను చేయించి ఇస్తానని ఉన్నికృష్ణన్ అనే దాత వాటిని చెన్నైలోని ఒక సంస్థకు అప్పగించారు. 2019లో ఆ బంగారు తాపడాల బరువు 42.8 కిలోలుగా అధికారులు రికార్డుల్లో చేర్చారు. అయితే, తమ వద్దకు తీసుకువచ్చినప్పుడు తాపడాల బరువు 38.28 కిలోలు మాత్రమే ఉందని చెన్నై సంస్థ చెప్పడంతో వివాదం తెరపైకి వచ్చింది. ఆలయం నుంచి ఆ బంగారు తాపడాలను తీసిన 40 రోజుల తర్వాత వాటిని చెన్నై సంస్థకు అందించినట్లు విచారణలో తేలింది. ఈ మొత్తం వ్యవహారంపై హైకోర్టు అనేక అనుమానాలు లేవనెత్తింది. ఒకేసారి తాపడాల బరువు 4.524 కిలోలు తగ్గడం ఏంటని ప్రశ్నించింది. దీన్ని తీవ్రంగా తీసుకున్న కోర్టు వాటిని తిరిగి అమర్చిన సమయంలో బరువును ఎందుకు చూడలేదని నిలదీసింది. అనుమతి లేకుండా ద్వారపాలక విగ్రహాల బంగారు తాపడాలను మరమ్మతుల కోసం తీసుకెళ్లడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

### జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై పిటిషన్లు




జమ్మూ కశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరించాలంటూ దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర హోదా అంశంపై దాఖలైన పిటిషన్లపై స్పందన చెప్పాలంటూ కేంద్రానికి నాలుగు వారాల గడువు ఇచ్చింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్లను విచారించింది. విద్యావేత్త జహూర్ అహ్మద్ భట్, సామాజిక కార్యకర్త అహ్మద్ మాలిక్‌తో పాటు పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. 2023 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీ మేరకు త్వరగా రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని పిటిషనర్లు కోరారు. ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పిటిషనర్ల తరపు న్యాయవాదులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. 2024 సెప్టెంబర్ 30 నాటికి జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి, త్వరలో రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని పునరుద్ధరించాలని ఆ సమయంలో సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. జమ్మూ కశ్మీర్‌కు ముందస్తు రాష్ట్ర హోదా రాజ్యాంగపరమైన అవసరమని ఇర్ఫాన్ హాఫీజ్ పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్ర హోదా పిటిషన్‌లో వాది అయిన ఇర్ఫాన్ హాఫీజ్ లోన్.. సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం గతంలో 2024 సెప్టెంబర్ నాటికి జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని, త్వరలోనే రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఆదేశించిందని తెలిపారు. రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా రాష్ట్ర హోదాను నిర్దిష్ట కాలపరిమితితో పునరుద్ధరించాలని కోర్టుకు ఒక ప్రతిపాదనను సమర్పించారు. జమ్మూ కశ్మీర్ మంత్రివర్గం ఆమోదించిన ఈ ప్రతిపాదన కాపీని కోర్టుకు సమర్పించామని ఆయన తెలిపారు. కేంద్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ.. ఈ అంశంపై జమ్మూ కశ్మీర్ పరిపాలనతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇది ఒక ప్రత్యేక పరిస్థితి అని, ఇందులో అనేక సున్నితమైన అంశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా కేంద్రపాలిత ప్రాంతాన్ని ప్రతికూల కోణంలో చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు.

# త్వరలో దేశవ్యాప్తంగా 'సర్'

దేశవ్యాప్తంగా ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను కేంద్ర ఎన్నికల కమిషన్ దశలవారీగా ప్రారంభించే అవకాశం ఉన్నది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఈసీ అధికారులు తెలిపారు. స్థానిక ఎన్నికలు, ఎన్నికలు జరుగనున్న, జరుగుతున్న రాష్ట్రాల్లో స్పెషల్ డ్రైవ్ ఉండదని పేర్కొన్నారు. ఎన్నికల యంత్రాంగం స్థానిక సంస్థల ఎన్నికలతో బిజీగా ఉందని.. దాంతో సర్‌పై దృష్టి పెట్టలేమని ఈసీ చెబుతున్నది. వచ్చే ఏడాది అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ ఐదు రాష్ట్రాలతో పాటు తొలి దశలో పలు రాష్ట్రాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రారంభించే ఛాన్స్ ఉంది. ఇప్పటికే బీహార్‌లో సర్ ప్రక్రియ పూర్తయ్యింది. 7.472 కోట్ల పేర్లతో తుది జాబితాను సెప్టెంబర్ 30న ఈసీ ప్రచురించింది. అన్ని రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల సవరణను ప్రారంభించే పని జరుగుతోందని.. ప్రారంభంపై తుది నిర్ణయం ఎన్నికల కమిషన్ తీసుకుంటుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గత సోమవారం తెలిపారు. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఒక సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు రాబోయే నుంచి 15 రోజుల్లో సర్ ప్రక్రియను ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రక్రియ పూర్తయ్యాక రాష్ట్రాల వారీగా తుది ఓటర్ల జాబితాను ప్రచురించాలని ప్రధాన ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో 2008 నుంచి ఓటర్ల జాబితాలున్నాయి. ఆ సమయంలోనే దేశ రాజధానిలో చివరిసారిగా సమగ్ర సవరణ జరిగింది. ఉత్తరాఖండ్‌లో చివరి సర్ 2006లో నిర్వహించగా.. ఆ సంవత్సరం ఓటర్ల జాబితా ఇప్పుడు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. చాలా రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల చివరి సర్ ప్రక్రియ 2002 నుంచి 2004 మధ్య జరిగింది. అక్రమ వలసదారులను తొలగించడంతో పాటు ఓటరు జాబితాల సమగ్రతను కాపాడడమే సర్ ప్రాథమిక లక్ష్యమని ఈసీ పేర్కొంటున్నది.

### ఆఫ్ఘనిస్థాన్‌కు అంబులెన్స్‌లు బహుమతిగా ఇచ్చిన భారత్




**న్యూఢిల్లీ:** ఆఫ్ఘనిస్థాన్‌కు ఐదు అంబులెన్స్‌లను భారత్ బహుమతిగా ఇచ్చింది. భారత్‌లో పర్యటిస్తున్న ఆ దేశ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకికి, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ శుక్రవారం వీటిని అందజేశారు. సద్భావన సంజ్ఞగా ఆఫ్ఘనిస్థాన్‌కు 20 అంబులెన్స్‌ల బహుమతిలో భాగం ఆ దేశ విదేశాంగ మంత్రి సమక్షంలో ఐదింటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. కాగా, కరోనా మహమ్మారి సమయంతో పాటు చాలా కాలంగా ఆఫ్ఘనిస్థాన్ ప్రజల ఆరోగ్య భద్రతకు భారత్ మద్దతిస్తున్నట్లు ఎస్ జైశంకర్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆఫ్ఘన్ ఆసుపత్రులకు ఎంఆర్ఐ, సిటీ స్కాన్ యంత్రాలను కూడా అందిస్తామని తెలిపారు. రోగ నిరోధకత, క్యాన్సర్ వ్యాక్సిన్లతోపాటు యూఎస్ఓడీసీ ద్వారా ఔషధాలు, మెడికల్ సామగ్రిని సరఫరా చేసినట్లు వివరించారు. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్‌కు మరింత సహాయం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు ఎస్ జైశంకర్ తెలిపారు. ఆరు కొత్త ప్రాజెక్టులను ఆ దేశంలో చేపడతామని చెప్పారు. ముఖ్యమైన దౌత్య చర్యలో భాగంగా కాబూల్‌లోని సాంకేతిక మిషన్‌ను భారత రాయబార కార్యాలయ హోదాకు శుక్రవారం అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రకటించారు. ఆఫ్ఘన్ ప్రజల పొరుగు దేశంగా, శ్రేయోభిలాషిగా ఆ దేశ అభివృద్ధి, పురోగతిపై భారత్ చాలా ఆసక్తిగా ఉన్నదని వెల్లడించారు.

# పోర్టులు.. ఎయిర్ పోర్టులతో ఆర్థికాభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

బీపీసీఎల్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ , క్రిబ్ కో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ కూడా రాబోతున్నాయి. రాష్ట్ర ప్రగతిలో.. రాష్ట్ర ఆర్థికాభివద్ధిలో నెల్లూరు జిల్లా కీలక పాత్ర పోషిస్తోంది. ఇదే సమయంలో జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం లేదు. సోమశిల, కండలేరు లాంటి మంచి ప్రాజెక్టులు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. 150 టీఎంసీల నీళు ఈ రెండు ప్రాజెక్టుల్లో ఉంటాయి. భవిష్యత్తులో నీటి కొరత లేకుండా ఈ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఉంచుతాం." అని ముఖ్యమంత్రి చెప్పారు. "ఏ ప్రాజెక్టులు చేపట్టినా... రాష్ట్రానికి ఆర్థికంగా ఉపయోగపడడంతోపాటు... పర్యావరణ హితంగా ఉండాలి. ఈ దిశగానే విశ్వసముద్ర మూడు ప్రాజెక్టులు చేపట్టింది. 24 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన విశ్వసముద్ర బయో ఎనర్జీ ఎథనాల్ ప్లాంట్ రోజుకు 200 కిలోలీటర్ల ఇథనాల్ ఉత్పత్తి చేస్తోంది. దీని కోసం 15 వేల టన్నులకు పైగా పాడైన బియ్యం, నూకలు, పంట వ్యర్థాల కొనుగోలు చేస్తోంది. దీని వల్ల రైతులకు మేలు జరుగుతోంది. రైతుల సంక్షేమంతో పాటు ఇథనాల్ తయారు చేస్తూ విశ్వసముద్ర యాజమాన్యం దేశ ప్రగతికి తోడ్పడుతోంది. అలాగే పశు సంపదను కాపాడేందుకు కొత్త ప్రయోగం చేయటం అభినందనీయం. వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన గోవులను సంరక్షిస్తున్నారు. ఒంగోలు జాతి పశువులను సంరంక్షిచడంపై ప్రత్యేకంగా గోశాల ఏర్పాటు చేయడమే కాకుండా.. శాస్త్రీయ పద్దతుల్లో పునరుత్పత్తికి చింతా శశిధర్ ఫౌండేషన్ పని చేస్తోంది. పవర్ ఆఫ్ బుల్ అనే విధానంలో విద్యుత్పత్తి చేపట్టడం వినూత్న ప్రక్రియ. ఈ విధానం ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 5 కిలోవాట్లను ఇన్ హౌస్ అవసరాలకు



వినియోగించుకుంటున్నారు. ఇక నంద గోకులం లైఫ్ స్కూల్ ద్వారా ప్రతిభ కలిగిన, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉత్తమ విద్యను అందిస్తున్నారు. సమాజానికి తిరిగి ఇవ్వటం అనే విధానంలో భాగమే పీ4. డబ్బులు ఇవ్వటం ఒక్కటే కాదు చేయూత ఇవ్వడమనేది పీ4 విధానంలో ముఖ్యమైన అంశం." అని ముఖ్యమంత్రి వివరించారు. "విశాఖకు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నాం. రూ.88 వేల కోట్లతో ఓ దేశచరిత్రలోనే అతిపెద్ద పెట్టుబడిగా విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కు ఆల్గారిథమ్స్ కూడా రాసేలా మన పిల్లలు సిద్ధం అవుతున్నారు. 2047కి భారత్ నెంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా తయారవుతుంది. ఏపీ దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఉంటుంది" అని సీఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీదా మస్తాన్ రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు హాజరయ్యారు.

# ఏపీలో రూ. 1,27,181 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం

-మొదటిపేజీ తరువాయి

6,646 మందికి ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. ప్రకాశం జిల్లాలో ప్రొపెల్లెంట్ ప్లాంట్ కు, కర్నూలు జిల్లాలో పారిశ్రామిక ఎస్టేట్ అభివద్ధికి, విశాఖపట్నం జిల్లాలో పారిశ్రామిక - లాజిస్టిక్స్ హబ్ కు, కర్నూలు జిల్లాలో ఇన్నోవేషన్ సెంటర్ కు, విజయనగరం జిల్లాలో ప్రైవేట్ మెగా పార్క్ కు భూమి కేటాయింపుకు అనుమతులు ఇవ్వబడ్డాయి. 56,353 ఉద్యోగ అవకాశాల కల్పన లక్ష్యంగా 8,186 కోట్ల రూపాయల పెట్టుబడులను అవకాశం కల్పిస్తూ ఈ కేటాయింపులు జరిగాయి. విశాఖపట్నంలో డేటా సెంటర్ మరియు ఐటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయడానికి ఆమోదం లభించింది. అమరావతిలో 4%-%స్టార్ హోటళ్లు, విశాఖపట్నం జిల్లా అరకు వ్యాలీలో ఒక లగ్జరీ రిసార్ట్, శ్రీశైలం (నంద్యాల జిల్లా)లో 3%-%స్టార్ హోటల్ మరియు కాకినాడ జిల్లాలో ఒక కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం లభించింది. సౌర విద్యుత్ మరియు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు అనంతపురం, విజయనగరం, కర్నూలు మరియు నంద్యాల జిల్లాల్లోను, కర్నూలు, ఏలూరు మరియు చిత్తూరు జిల్లాల్లో ఆహార ప్రాసెసింగ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆమోదం లభించింది. ఆంధ్రప్రదేశ్ టెక్ హబ్‌లకు భూమి ప్రోత్సాహకం విధానం (4.0) 2024%-% 29 టైర్%-%2 నగరాల్లో రాష్ట్ర పోటీతత్వాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం మధ్య తరహా సంస్థలు మరియు అభివద్ధి చెందుతున్న రంగాలకు ఎకరానికి రూ.4 కోట్ల చొప్పున పెట్టుబడికి సిద్ధంగా ఉన్న భూమిని అందిస్తుంది, 500 ఉద్యోగాలు మరియు 12 నెలల్లో ప్రాజెక్ట్ కార్యాచరణకు హామీ ఇస్తుంది. గూగుల్ అనుబంధ సంస్థ అయిన రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ. 87,520 కోట్ల భారీ పెట్టుబడితో నాలుగు వందల ఎనభై ఎకరాల్లో విస్తరించి ఉన్న అత్యాధునిక డేటా సెంటర్ సౌకర్యాలను స్థాపించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రెండు వందల ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు వేలాది పరోక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి.



నెదర్లాండ్స్, వర్జీనియా మరియు తైవాన్ వంటి ప్రాంతాలలో గూగుల్ డేటా సెంటర్ పెట్టుబడులు స్థిరంగా పరివర్తన ప్రయోజనాలను అందించిన నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ కూడా ఇలాంటి అభివద్ధి లాభాలను అనుభవించడానికి సిద్ధంగా ఉంది.ఈ డేటా సెంటర్ సౌకర్యాలు నిర్మాణం, తయారీ మరియు ఐఖీ సేవలు వంటి రంగాలలో అధిక నాణ్యత గల ఉపాధిని సష్టిస్తాయి. అదే సమయంలో రాష్ట్ర డిజిటల్ మౌలిక సదుపాయాలను గణనీయంగా పెంచుతాయి. అధునాతన సాంకేతికతలు మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ఆధారిత సామర్థ్యాల ఉనికి ఆవిష్కరణలను వేగవంతం చేస్తుంది, మరింత పెట్టుబడులను ఆకర్షిస్తుంది మరియు స్థానిక సంస్థలకు సాంకేతిక శక్తిని అందిస్తుంది. అనకాపల్లిలో యాభై ఐదు వేల కోట్ల ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ కోసం %వీ%/టఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్‌కు దశల వారీగా చేసిన భూమి చెల్లింపులపై రూ. 12.58 కోట్ల వడ్డీ మినహాయింపు మంజూరు చేయబడింది. రామయపట్నం రిఫైనరీ స్థలంలో రోడ్డు రీఅలైన్‌మెంట్ కోసం %వీ%/టభారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ అభ్యర్థన ఆమోదించబడింది, అభివద్ధి వ్యయం రూ. 113 కోట్లను ఆ్కఇఔ భరిస్తుంది. నాయుడుపేటలో కార్బన్ బ్లాక్ ప్లాంట్ కోసం %వీ%/ట్కఇఆఔ కెమికల్ లిమిటెడ్ యొక్క రూ. 2,717 కోట్ల సవరించిన పెట్టుబడి ప్రతిపాదన సర్దుబాటు చేసిన కాలపరిమితులతో అంగీకరించబడింది. %వీ%/టభారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మార్చి 2029 నాటికి రూ. 1400 కోట్లు పెట్టుబడికి సంబంధించిన ప్రోత్సాహకాల అభ్యర్థన ఆమోదించబడింది. అమరావతిలో దస్పల్ల అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 4%-%స్టార్ హోటల్ (దస్పల్ల బ్రాండ్) అభివద్ధికై ప్రోత్సాహకాలు అందించేందుకు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. తద్వారా రూ.200 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగ అవకాశాలు. అమరావతి ప్రభుత్వ సముదాయ ప్రాంతంలో అమరావతిలో గవర్నర్ నివాస సముదాయం, గవర్నర్ మాన్షన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ ఆఫీస్ మరియు ఆఫీషియల్స్ %-% స్టాఫ్ క్వార్టర్స్ మొదలైనవాటితో కూడిన నిర్మాణ పనులకు రూ.212.22 కోట్ల పరిపాలనా ఆమోదం కోసం చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

# సంక్రాంతి నాటికి డీఎస్సీ...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరో గుడ్ న్యూస్ చెప్పారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, కళాశాల విద్య ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన డీఎస్సీ జనవరిలో నిర్వహించబోతున్నట్టు వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏటా డీఎస్సీ, టెట్ ఉంటాయని పునరుద్ఘాటించారు. ప్రతిఏటా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీకి ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని మంత్రి నారా లోకేష్ మరోసారి ప్రకటించారు. ఈ ఏడాది నవంబర్ చివరి వారంలో టెట్, 2026 జనవరిలో డీఎస్సీ నోటిఫికేషన్, మార్చిలో డీఎస్సీ నిర్వహించి, టీచర్ పోస్టులను భర్తీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. టెట్, డీఎస్సీలకు అభ్యర్థులంతా సన్నద్ధం కావాలి సూచించారు. కొత్త డీఎస్సీ నిర్వహణ తర్వాత వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా ప్రణాళిక అమలు చేస్తామన్నారు లోకేష్. 2026 జనవరిలో నోటిఫికేషన్, మార్చిలో డీఎస్సీ, స్పెషల్ డీఎస్సీ నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలపై లక్ష్యసాధనకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అన్నారు. బేస్ లైన్ టెస్ట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 78మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను మెరుగైన విద్యాప్రమాణాలపై అధ్యయనానికి సింగపూర్ పర్యటనకు పంపించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. మెగా డీఎస్సీ పేరుతో ఇప్పటికే ఈ ఏడాది ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. కొత్త రిజర్వేషన్లు అమలులోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఏప్రిల్ 20న 16వేలకుపైగా పోస్టులతో తొలి నోటిఫికేషన్ ఇచ్చింది. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తొలి రోజే డీఎస్సీ నియామక నోటిఫికేషన్ విడుదలకు సంబంధించి సంతకం చేశారు. కానీ రిజర్వేషన్ల అంశం ఇతర న్యాయ సమస్యలను పరిష్కరించుకొని ఏప్రిల్‌లో నోటిఫికేషన్ వచ్చింది. ఏప్రిల్‌లో వచ్చిన నోటిఫికేషన్‌కు జూన్‌లో పరీక్షలు పెట్టారు. నెల రోజుల పాటు పరీక్షలు నిర్వహించారు. అక్కడికి నెల రోజుల తర్వాత ఫలితాలు విడుదల చేసి నియామక ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అమరావతిలో వేడుకగా కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాలను కూడా అందజే?శారు. ఆ టైంలోనే ఏటా డీఎస్సీ ఉంటుందని నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ వేస్తున్నామని మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అన్నట్టుగానే అందుకు తగ్గ కార్యచరణ చేపట్టాలని అధికారులకు మంత్రి నారా లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. మొన్న నోటిఫికేషన్‌లో మిగిలిన పోస్టులు, ఇంకా వివిధ పాఠాశాలల్లో ఉన్న ఖాళీల గుర్తించాల్సి ఉంది. ఈసారి భారీ స్థాయిలో పోస్టులు ఉండకపోవచ్చని అధికారులు చెబుతున్నారు.

**భారీగా పోలీసుల నియామాకాలు**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగులకు త్వరలోనే గుడ్‌న్యూస్ అందించే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్రంలో పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఉన్న ఖాళీలను భర్తి చేసేందుకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వు, ఏపీఎస్‌సీ, సీపీఎల్, పీటీఓ, కమ్యూనికేషన్స్‌లో.. ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసు విభాగంలో ఖాళీల వివరాలకు సంబంధించిన లేఖను ఇప్పటికే డీజీపీ.. ప్రభుత్వానికి పంపించారు. ఆ వివరాలు పరిశీలించిన తర్వాత ప్రభుత్వం అనుమతి ఇస్తే.. పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.రాష్ట్ర ప్రభుత్వానికి డీజీపీ కార్యాలయం పంపించిన లేఖలో ఖాళీల వివరాలను ప్రస్తావించింది. ఈ ఏడాది? ఆగస్టు 31వ తేదీ వరకు ఉన్న ఖాళీలని అందులో వెల్లడించారు. దాని ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగంలో.. సివిల్ పోలీస్ ఫోర్స్‌లో 315 ఎస్సైలు, 3580 సివిల్ కానిస్టేబుల్, 96 ఆర్ఎస్ఐ, 2520 ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. ఈ పోస్టుల నియామకాలకు అనుమతించాలని విజ్ఞప్తి చేసింది. అయితే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో రోజురోజుకూ నేరాలు పెరుగుతున్నాయని ప్రభుత్వానికి రాసిన లేఖలో డీజీపీ పేర్కొ?న్నారు. నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో నేరాలు పాల్పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను పటిష్టం చేయాలంటే.. పోలీస్ ఫోర్స్ అవసరమని అన్నారు. అందుకోసం ఖాళీలను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా నిరుద్యోగుల గరిష్ఠ వయోపరిమితి పెంచింది. న్-యూనిఫాం సర్వీస్‌ల్లో పోస్టులకు.. గరిష్ఠ వయోపరిమితిని 34 నుంచి 42 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రకారం.. ఇప్పుడు 42 ఏళ్ల వరకు కూడా ఈ ఉద్యోగాలకు అప్లై చేసుకోవచ్చు.యూనిఫాం పోస్టులకు రెండేళ్లు వయోపరిమితి పెంచింది. ఈ సడలింపు వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు వర్తించనున్నట్లు తెలిపింది. ఏపీపీఎస్సీ, ఇతర నియామక సంస్థల ద్వారా జరిగే నియామకాలకు ఇది వర్తిస్తుందని సర్కార్ పేర్కొంది. అయితే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో చాలా మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడనున్నాయి. అందులో ముఖ్యంగా, వయసు కారణంగా ఉగ్యోగాలు అనర్హులుగా ఉన్నవారు.. ఈ వయోపరిమితి పెంపుతో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు.

## పిల్లలపై ఒత్తిడి పెరుగుతోంది

**విజయవాడ :** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండ్లాస్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. నర్సింగ్ విద్యార్థినిలతో కలిసి మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ లక్ష్మీశా, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, డి.ఎం.హెచ్.ఒ సుహాసిని ర్యాలీలో పాల్గొన్నారు. ఐఎంఏ హాల్ నుంచి ఏలూరు రోడ్, అప్సర థియేటర్ మీదుగా ఐఎంఏ హాల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో చాలా మంది ఒత్తిడిని తట్టుకోలేక పోతున్నారని.. విద్యార్థుల ప్రతిభను మించి వారిపై ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు ఆలోచనల్లో కూడా మార్పు రావాలని సూచించారు. మానసిక వ్యాధులతో బాధ పడేవారి సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రపంచంలో 90 కోట్ల మంది మానసిక వ్యాధులుతో బాధ పడుతున్నారని మంత్రి వెల్లడించారు. వారిని ముందుగా గుర్తించకపోవడం వల్ల ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉందన్నారు. మన దేశంలో 15 కోట్ల మంది మానసిక ఇబ్బందులతో బాధ పడుతున్నారని తెలిపారు. సమాజంపై కూడా వీరి ప్రభావం చాలా ఉందన్నారు. ఆర్థిక ప్రభావం కూడా ఒక ట్రిలియన్ డాలర్లుగా ఉందని అన్నారు. మానసిక వ్యాధులపై ప్రజల్లో సరైన అవగాహన కల్పించాలని వ్యాఖ్యానించారు. పిల్లలపై కూడా అనేక విధాలుగా ఒత్తిడి పెరుగుతోందన్నారు. యువత, చిన్న పిల్లలు కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. 2021లో 8067 మంది ఒత్తిడితో ఆత్మహత్యలు చేసుకున్నారని మంత్రి చెప్పుకొచ్చారు. మానసిక వ్యాధులకు చికిత్స అందించేందుకు అవసరమైన సైకియాట్రిక్‌లు మన దగ్గర లేరన్నారు. లక్ష మందికి ముగ్గురు సైకియాట్రిక్‌లు అవసరం ఉంటే 0.75 శాతమే ఉన్నారని వివరించారు. ప్రభుత్వం వైపు నుంచి సహకారం అందిస్తున్నామని.. దేశంలో ఏపీ మంచి వైద్యం అందించడంలో ముందున్నామని వెల్లడించారు. క్లినికల్ సైకాలజీ ఏర్పాటుకు ఇండ్లాస్‌కు అవకాశం ఇచ్చామన్నారు. మానసిక వ్యాధులపై ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాలని సూచించారు. తొలి దశలోనే గుర్తించి సరైన వైద్యం ఇప్పించాలన్నారు. పిల్లలు బాగా ఎదగాలనీ కోరుకోవాలి.. కానీ ఒత్తిడి చేసి వారిని మానసికంగా ఇబ్బందులకు గురిచేయవద్దని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

**వాటికి బానిస కావొద్దు: కలెక్టర్**

మానసిక ధృడత్వం నేడు చాలా ముఖ్యమని కలెక్టర్ లక్ష్మీ శా అన్నారు. చాలా మంది చిన్న అంశాలకే ఒత్తిడికి గురి అవుతున్నారని.. నలుగురితో కలిసి ఉండలేక మెంటల్‌గా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నేటి సమాజంలో సెల్‌ఫోన్ కూడా మానసిక వ్యాధులకు ప్రధాన కారణంగా చెప్పుకొచ్చారు. గేమ్స్, సోషల్ మీడియా ప్రభావం యువతపై బాగా ఉంటుందని.. వాళ్ల ప్రపంచం దాటి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. సమాజం మొత్తం ఈ తరహా ఘటనలపై ఆలోచన చేయాలన్నారు. పిల్లలు సెల్ ఫోన్ గేమ్స్‌కు బానిస కాకుండా చూడాలని సూచించారు. సైకియాట్రిక్‌లు ద్వారా తొలి దశలో వైద్యం అందించేలా చూడాలని.. ప్రతి ఒక్కరూ మానసిక రుగ్మతలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ లక్ష్మీ శా వెల్లడించారు

## 'అప్పుడు రూ. 99లకే "క్వార్టర్" ఇప్పుడు 99 పైసలకే ఎకరం భూమి'

-మొదటిపేజీ తరువాయి

కురసాల కన్నబాబు ఆవిష్కరించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వంలో 17 కళాశాలల్ని తీసుకువచ్చి ..ఐదు కళాశాలల్లో అడ్మిషన్లు పూర్తి చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌ది. పేదల పక్షాన జగన్... కార్పొరేట్ సంస్థల పక్షాన చంద్రబాబు ఉంటారని ప్రజలకు తెలుసు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణకు వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. అన్ని వర్గాల నుండి ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుకూలంగా మద్దత్తు కూడకట్టాలి నిర్ణయించారు. రచ్చ బండ కార్యక్రమం ద్వారా ప్రజలకు అన్ని విషయాలు తెలియజేస్తాం. మేధావులు,తటస్థుల వద్దకు వెళ్ళి మెడికల్ కళాశాలల్ని అమ్మేయ్యడం ఎంత దుర్మార్గమో చెబుతాం. నిన్న జగన్ పర్యాటనలో ప్రభుత్వ తీరు బ్రిటిష్ పాలనను మించిపోయింది. ఎన్నో రకాలుగా జగన్ పర్యటనను ఫెయిల్ చేయ్యలని చూశారు. ఎప్పుడు లేనంతగా జగన్ కోసం జనం ప్రభంజనంలా తరలి వచ్చారు. మలమూత్రాలు కలిసిన నీళ్ళు తాగాల్సిన దుస్థితి గిరిజన హస్టల్స్ లో ఉండడం దుర్మార్గం. గిరిజన విద్యార్థులకు త్రాగునీరు అందించలేని చంద్రబాబు విజన్ 2027 అంటున్నాడు.లి క్వాంటమ్ వ్యాలీ అంటూ కాలయాపన చేస్తున్నాడు. పాడేరు లో ఒక మెడికల్ కళాశాల నిర్మించాలనే ఆలోచన 15 ఏళ్ళ ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు కు ఎందుకు రాలేదు. లిచంద్రబాబు కు అమ్మేయడం...దోచుకోవమే తెలుసు. మేము వస్తే రూ.99 లకు క్యాటర్ బాటిల్ ఇస్తామని చంద్రబాబు చెప్పాడు..ఇప్పుడు 99 పైసలకే ఎకరం భూమి ఇస్తున్నాడు. ఒక ప్రతిపక్ష నేతగా...పార్టీ అధ్యక్షుడుగా వైఎస్ జగన్ విశాఖ వస్తే.. పోలీసు అధికారులు కూటమీ నేతల్లా మాట్లాడారు. వైఎస్ జగన్ మాజీ ముఖ్యమంత్రి. 2029 లో వైఎస్ జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారని పోలీసు అధికారులు గుర్తించండి' అని హెచ్చరించారు.

## టెక్స్ టైల్స్ రంగంలో పెట్టుబడులతో రండి

-మొదటిపేజీ తరువాయి

ఆ కంపెనీ ప్రతినిధులు డాక్టర్ చక్రవర్తి, సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని సీఎం చంద్రబాబు నేతత్వంలో కూటమి ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను తక్షణమే అందజేస్తున్నామన్నారు. ముఖ్యంగా నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకురావడంతో ఆ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఏర్పాడిందన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున టెక్స్ టైల్స్ పార్క్ లో నిర్మాణం చేపట్టామన్నారు. అనంతరం అమెల్ సి ఆల్ట్ కన్సార్టియం ప్రతినిధులను మంత్రి సవిత ఘనంగా సత్కరించారు.

## తలనొప్పిగా మారుతున్న తమ్ముళ్ల తన్నులాటలు

**అనంతపురం :** ఉమ్మడి అనంతపురం జిల్లా లోని కొన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. అధికార పార్టీ అయినప్పటికీ నాయకుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ధర్మవరం , రాప్తాడు వంటి నియోజకవర్గాల్లో పార్టీ లోపలకే సమస్యలు ఏర్పడుతున్నాయి. అయితే ఇప్పటివరకు వీరి మధ్య అనుకున్నంత పెద్దగా సవాళ్లు కనిపించవు.తాజాగా రాయదుర్గం నియోజకవర్గంలో కాల్వ శ్రీనివాసులు పై పార్టీ లోపల విమర్శలు వినిపించాయి. శ్రీనివాసులు సీనియర్ నేత, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యేగా ఉన్నారు. తన రాజకీయ చరిత్రలో సౌమ్యుడనే పేరు తెచ్చుకున్నాడు, అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారు. తన సామాజిక వర్గానికి మాత్రమే కాకుండా, అన్ని వర్గాల వారిని కలుపుతూ ముందుకు వెళ్తూ అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.కానీ, ఇటీవల ఆయనపై సొంత పార్టీలో కొన్ని విమర్శలు వచ్చాయి. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో పాత ఘర్షణలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో అధికారపక్షం లోపలే విభేదాలు పెరుగుతున్నాయి.. ఇది స్థానిక రాజకీయ వాతావరణంలో టిడిపి నాయకులకు సవాలు గా మారింది. ఇక ఈ లక్షలు మరీ ఎక్కువ కావడంతో లోకల్ గా కూడా "ఎంతకాలం ఈ గొడవలు?" అనే విమర్శలు వినిపిస్తున్నాయి.వైసీపీ నాయకులు, ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి విషయంలో టిడిపి అనుసరిస్తున్న విధానాలపై ప్రజలు కాస్త తీవ్రమైన విమర్శలు చేస్తున్నారు. రాజకీయంగా కేవలం దూకుడే ఫలితాన్ని ఇవ్వదు. స్థానిక పరిస్థితులు, ప్రజల ఆలోచనలు, సమాజ మార్పులను అర్థం చేసుకుని నాయకులు సరైన వ్యూహాలను రూపొందించుకోవాలి. అలా కాకపోతే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.ఇక చంద్రబాబు నాయుడు ఈ సమస్యపై పెద్దగా దృష్టి పెట్టకపోవడం కూడా వార్తల్లో వినిపిస్తోంది. కానీ, స్థానిక రాజకీయ దృష్ట్యా ఇది సరైన పరిణామం కాదని విశ్లేషకులు చెబుతున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలను సమర్థవంతంగా సర్దుమణిగే విధంగా ఆయన ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, స్థానిక స్థాయిలో సమైక్యత సాధించడానికి చర్యలు అవసరమని విశ్లేషకులు సూచిస్తున్నారు.మొత్తానికి, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నియోజకవర్గాల్లో నాయకుల మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నప్పటికీ, సవాళ్లను సానుకూలంగా పరిష్కరించే ప్రయత్నాలు ఇప్పటి వరకు లేకపోవడం రాజకీయ వర్గాల్లో ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది. టిడిపి నాయకులు మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకోవాలి అని రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

# కోటి సంతకాల సేకరణ సంతకాల కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం (శుభోదయం న్యూస్):



సేకరణకు నడుంబిగిద్దాం వైఎస్ఆర్‌సీపీ ఎస్ఈసీ సభ్యుడు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ చేశారు,మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణకు పార్టీ శ్రేణులు నడుంబిగించాలని వైఎస్ఆర్‌సీపీ ఎస్ఈసీ సభ్యులు, మాజీ కుడా ఛైర్మన్, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పిలుపునిచ్చారు. శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ.. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని, వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్ 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కాలేజీల నిర్మాణాలను పూర్తి చేయలేక చంద్రబాబు ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రైవేట్‌పరం చేస్తూ వైద్యాన్ని పేదలకు దూరం చేసే కుట్ర చేస్తుందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ వైఎస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు నేటి నుంచి 45 రోజుల పాటు విస్తృత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని గ్రామాలు, వార్డుల్లో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి సంతకాలు సేకరించాలని సూచించారు. పౌరసమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న మేధావి వర్గాలు, ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలను కలుపుకొని సంతకాలు సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు, కర్నూలు నియోజకవర్గ అబ్జర్వర్ కర్ర హర్షవర్ధన్ రెడ్డి, గూడూరు జడ్పిటి మౌలాలి, రేమట సంపత్ కుమార్, గొల్లల దొడ్డి సర్పంచ్ లోకేష్, కర్నూలు మండల కన్వీనర్ మోహన్ బాబు, కోడుమూరు నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షులు ఎం కె వెంకటేష్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షులు గిరి ప్రసాద్, రైతు విభాగం అధ్యక్షులు నరసింహులు, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి మధు సూదన్, కర్నూలు మండల ఎస్ సీ సెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కర్నూలు మండల ఉప అధ్యక్షుడు గొందిపర్ల గోపాల్, కొండా రెడ్డి, సి బెలగల్ మండల ఆర్ టి ఐ విభాగం అధ్యక్షులు మహానంది, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ పై అవగాహనఎస్ కే పి డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీ

గుంతకల్లు, ప్రతినిధి పల్లె రామాంజనేయులు (శుభోదయం న్యూస్):




జిఎస్టి 2.0 పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎస్కేపి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు జిఎస్టి రేట్లు తగ్గించడంతో ప్రజలకు కలిగే లాభాలను ర్యాలీ ద్వారా వివరించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మయ్య, అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ రవి శంకర్ శర్మ, అధ్యాపకులు రాఘవేంద్ర ప్రసాద్ ,నాగరాజు, బాలకృష్ణ ,ఎన్ నారాయణ అల్తాఫ్ ,రాజశేఖర్ ,శివప్రసాద్ ,మరి స్వామి పాల్గొన్నారు

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా వస్త్రాలు పంపిణీ

గుంతకల్లు, ప్రతినిధి పల్లె రామాంజనేయులు (శుభోదయం న్యూస్):




ప్రపంచ లయన్స్ క్లబ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అంబేద్కర్ నగర్లోని 50 మంది వృద్ధులకు చిన్నారులకు ఉచితంగా వస్త్రాలను సుమంగళి టెక్స్టైల్స్ యజమాని శ్రీనివాసులు రాజ్యాంగ అవగాహన వేదిక మహిళ విభాగ అధ్యక్షురాలు జింకల సరస్వతి వారికి కృతజ్ఞతలు తెలిపారు అనంతలమామి లైవ్ క్లబ్ అధ్యక్షురాలు పద్మావతిని జగన్ శాలువాతో ఘనంగా సత్కరించారు

## జయకర్ క్రిస్టియన్ 79వ జయంతిలో సంఘ కాపరులకు ఆర్డినేషన్ కార్యక్రమం

కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ ఇన్ నాగరత్నం (శుభోదయం న్యూస్):



కర్నూలు పోలము బాప్టిస్ట్ సంఘముల సమాజము మరియు జయాకర్ క్రిస్టియన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జయాకర్ క్రిస్టియన్ గారి 79 వ జన్మదిన సందర్భంగా కర్నూల్ పోల సమాజంలో పనిచేస్తున్న సంఘ కాపరులకు ఆర్డినేషన్ కార్యక్రమము ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి పోల సమాజము అధ్యక్షులు గారైన రేవా ఎన్ కేరల్ జయాకర్ క్రిస్టియన్ దైవ సందేశం అందించి ఆర్డినేషన్ పొందుతున్న సంఘ కాపరులకు సలహాలు సూచనలు అందజేశారు ,ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రేవా ఎస్ జయకాంత్ క్రిస్టియన్ మరియు ఇన్చార్జులు సంఘ కాపరులు పాల్గొన్నారు

# నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించిన ఏలూరు జిల్లా రవాణా శాఖ

ఏలూరు జిల్లా(శుభోదయం న్యూస్):



ఏలూరు జిల్లాకు టార్గెట్ 5.10 కోట్లు – 5.80 కోట్లు వసూళ్లు చేసిన రవాణా శాఖ అధికారులు.వాహన తనిఖీల విభాగంలో నూరు శాతం లక్ష్యాన్ని ఏలూరు జిల్లా రవాణా శాఖ అధికారులు అధిగమించారు.వాహన తనిఖీల మీద నెలకు 85 లక్షల రూపాయల చొప్పున ఏప్రియల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు మాసాలకు 5.10 కోట్ల రూపాయలను ఏలూరు జిల్లాకు లక్ష్యముగా నిర్ణయించగా 5.80 కోట్ల రూపాయలను సాధించినట్లు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ తెలిపారు. మోటార్ వాహనాలకు 8,821 కేసులు నమోదు చేయడం ద్వారా 114 శాతం లక్ష్యాన్ని సాదించగలిగామన్నారు. ఇందులో ఫిట్నెస్ లేనందుకు 1,018 కేసులు నమోదు చేయడం ద్వారా రూ. 24,83,000/-, పర్మిట్ లేని లేనందుకు 374 కేసులు నమోదు చేయడం ద్వారా రూ. 36,36,300/-, పన్ను చెల్లించనందుకు 2,273 కేసులు నమోదు చేయడం ద్వారా రూ. 18,76,600/-, డ్రైవింగ్ లైసెన్స్ లేనందుకు గాను 1,349 కేసులు నమోదు చేయడం ద్వారా రూ. 33,10,200/-, హెల్మెట్ ధరించనందుకు గాను 1,319 కేసులు నమోదు చేయడం ద్వారా 10,90,000/-, వాహన ఇన్సూరెన్స్ లేనందుకు గాను 1,357 కేసులు నమోదు చేయడం ద్వారా 27,48,000/– అపరాధ రుసుము విధించి, నూటికి నూరు శాతమే కాకుండా అదనంగా 14 శాతం లక్ష్యాన్ని అధిగమించినట్లు కరీమ్ తెలిపారు.

# ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కు అభినందనలు తెలిపిన బైరెడ్డి, దారపనేని

పామూరు మండలం, రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్):



కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణానికి 2 కోట్ల 80 లక్షలు సిమెంటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయటం పట్ల కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు మండల సింగిల్ విండో అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పామూరు పట్టణానికి ఎంజిఎన్ఆర్ జిఎస్ నిధులతో ఐదు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసి పామూరు పట్టణంలో విస్తారంగా సిమెంట్ రోడ్ల నిర్మాణాన్ని జరిపించారు. నెల్లూరు రోడ్డులోని మయూరి లాడ్జి దగ్గర నుండి బైపాస్ వరకు సింగిల్ సిమెంట్ రోడ్డుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటే పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సిమెంట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయటం హర్షించదగినదని వారు తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిని నియోజకవర్గం ప్రజలు ప్రశంసిస్తున్నారని దారపనేని, బైరెడ్డి పేర్కొన్నారు.

# పూర్వ విద్యార్థుల చేత స్కూలుకు 60 వేల విలువైన సామాగ్రి బహుకరణ

పిడుగురాళ్ల టౌన్, రిపోర్టర్ శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్):



మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పిడుగురాళ్ల నందు 1998 – 99 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్కూలు పిల్లలకు అవసరమైనటువంటి స్పోర్ట్స్ కిట్టు మరియు పాఠశాల నిర్వహణకు అవసరమైనటు వంటి ప్రింటర్ను దాదాపు 60 వేల రూపాయలు విలువగల సామాగ్రిని అందించడం జరిగింది.మునగ వెంకట్ షేక్ జానీ బాషా మరియు మురళి మాట్లాడుతూ పిల్లలు చదువులతో పాటు ఆరోగ్యంగా ఉండాలి అంటే ఆటలు చాలా అవసరమని ఆటలు మానసిక మరియు శారీరక వికాసానికి చాలా అవసరం అని చెప్పారు. ఆటల వల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందించ బడతాయని తెలియజేశారు. పిల్లలు ఆటలు మరియు చదువులలో ప్రతిభ కనబరిచి మన స్కూలుకి అదేవిధంగా పిడుగురాళ్ల పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పదవ తరగతి పూర్వ విద్యార్థులందరూ కలిసి స్పోర్ట్స్ కిట్టు మరియు ప్రింటర్ను హెచ్ఎం గారికి, లకు మరియు విదార్థులకు అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో మునగ వెంకట్, మల్లికార్జున్ రెడ్డి, దేశినేని వెంకట్, మంగయ్య, బెల్లంకొండ కిషోర్ ,జానీ భాష, భరత్, పిచ్చయ్య, సాగర్, ఆనంద్ గోపాల కృష్ణ,శంకర్, మురళి, బికారి సాహెబ్, నాసర్ వలి, వెంకట్ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో రాజ్యలక్ష్మి పుట్టినరోజు వేడుకలు

ఒంగోలు, (శుభోదయం న్యూస్):



పుట్టినరోజులను ఆర్భాటంగా చేసుకునే ఆనవాయితీ నుండి సేవా కార్యక్రమాలు వైపు దృష్టి సాగించడం అభినందనీయం అని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు అన్నారు. అంగన్వాడి ఒంగోలు నియోజక వర్గం అధ్యక్షురాలు నారాయణ స్వామి రాజ్యలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయం నందు వృద్ధులు పేదల మధ్య కేక్ కట్ చేసి ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివం శరణంలోని వృద్ధులకు పండ్లు కాయలు పంపిణీ మరియు శివం సంచార వాహనం ద్వారా ఒంగోలు నగరంలో 300 మంది అనాధలకు అన్నదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సినీ నటులు బీసీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షులు దన్నారపు మస్తానావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల ద్వారా తమ పుట్టినరోజులను జరుపుకుంటే ఇంకొకరికి మేలు చేసినవారు అవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి సహచరులతోపాటు వివరం గోవిందు ఒంగోలు మురళీకృష్ణ వెంకయ్య. నైనాల వేణుగోపాల్ శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు బహుమతుల పంపిణీ

గుంతకల్లు ప్రతినిధి పల్లె రామాంజనేయులు(శుభోదయం న్యూస్):



అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని హావలిగి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు శుక్రవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత బహుమతులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో విడపనకల్లు అంగన్వాడీ సూపర్వైజర్ పుష్ప,పాఠశాల పిఈటి వరలక్ష్మి ఏఎన్ఎం రామలింగమ్మ ,జి ఎం ఎస్ అనుష పాల్గొన్నారు

## పామూరు వైయస్ఆర్సీపీ కార్యాలయంలో మండల నాయకులతో భేటీ అయిన జంకె వెంకటరెడ్డి

పామూరు మండలం, రిపోర్టర్ బండి రమేష్(శుభోదయం న్యూస్):



పామూరు వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో పామూరు మండలం నాయకులతో పార్టీ బలోపేతం గురించి చర్చించి మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జిల్లా మాజీ అధ్యక్షులు జాంకే వెంకట రెడ్డి గారు వారికి పూలమాతో సత్కరించిన పామూరు మండలం వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు గంగసాని హుస్సేన్ రెడ్డి ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా టీచర్ల విభాగం అధికారులు కల్లూరి రామిరెడ్డి సీనియర్ నాయకులు గట్ల విజయ భాస్కర్ రెడ్డి అంబటి కొండారెడ్డి, చల్లా సుబ్బా రావు, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరామ్ శ్రీనివాసులు, వెలుతుర్ల తిరుపతిరెడ్డి, షేక్ రసూల్ ,చింతం రెడ్డి బాలి రెడ్డి ,కోటపాటి రమణా రెడ్డి, వాకమల్ల కోటి రెడ్డి, తాతిరెడ్డి నరసారెడ్డి ,పాలేటి ప్రేమ్ కుమార్. తదితరులు పాల్గొన్నారు

## జంగిటి రాజేంద్రప్రసాద్ కు శుభాకాంక్షలు

సిద్ధపటం మండలం, విలేకరి జాకీర్ హుస్సేన్(శుభోదయం న్యూస్):




లంక మల్ల అభయారణ్యంలో వెలసిన నిత్య పూజ స్వామి ఆలయ చైర్మన్గా జంగిట రాజేంద్రప్రసాద్ నియమితులు కావడంతో, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డి సిద్ధవటం మండల సింగల్ విండో అధ్యక్షులు మరియు క్లస్టర్ ఇంచార్జ్ దారపునేని దశరథ రామానాయుడు పెద్దపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి తుర్ర ప్రతాప్ నాయుడు మాధవరం యూనిట్ కన్వీనర్ పెగడ హరి ప్రసాద్ శుభా కాంక్షలు తెలియజేశారు



# ఒంగోలులో కల్తీ మద్యంపై ధర్నాలో పాల్గొన్న గంగసాని లక్ష్మీ






**ఒంగోలు జిల్లా(శుభోదయం న్యూస్):**

వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారి ఆదేశాలతో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎమ్మెల్సీ శ్రీమతి వరుదు కళ్యాణి సూచనలతో ఒంగోలు జిల్లా అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే దాచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి సహకారం తో ఈరోజు శుక్రవారం స్థానిక ఒంగోలు నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలవేసి ఆంధ్ర రాష్ట్రంలో జరుగుతున్న కల్తీ మద్యం పై పోరాటం లో పాల్గొన్న గంగసాని లక్ష్మీ మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రంలో ఎక్కడ చూసినా కల్తీ మద్యపానంతో ఎంతోమంది ప్రాణాలు తీస్తూ ఆడబిడ్డలకు పసుపు కుంకుములు లేకుండా చేస్తున్న ఈ కూటమి ప్రభుత్వానికి అతి త్వరలో రాష్ట్ర ప్రజలందరూ తగిన బుద్ధి చెప్తారని రాష్ట్రం కల్తీ మద్యం దొరుకుతున్న ఎటువంటి చర్యలు తీసుకోనీ కూటమి ప్రభుతం కల్తీ మద్యాన్ని నివారించాలని లే నీ యెడల ఇకపై మరెన్నో ధర్నాలు చేస్తామని చెప్పడం జరిగింది ఈ పోరాటం లో పాల్గొన్న జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంప రమణమ్మ గారు,పులి శాంతి గారు,గాయం సావిత్రి గారు ,జమిళ బేగం గారు ,పందిటి లక్ష్మి గారు, సవరం రాత్తమ్మ గారు జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ మహిళా నాయకులు - కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# నూజివీడులో బాణాసంచా కేంద్రాలపై సంయుక్త తనిఖీలు

**ఏలూరు జిల్లా, ప్రతినిధి- ప్రసాద్ (శుభోదయం న్యూస్):**

ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు నూజివీడు డిఎస్పీ కె.వి.వి.ఎన్.వి.ప్రసాద్ పర్యవేక్షణలో నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కొప్పిశెట్టి.రామకృష్ణ పోలీస్ రెవెన్యూ మరియు అగ్నిమాపక సిబ్బందితో కలిసి నేడు నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలో బాణాసంచా తయారీ మరియు నిల్వ కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు వ్యక్తులు అక్రమంగా బాణాసంచా తయారీ,నిల్వ లేదా విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం అందిందని అందువల్ల ఇలాంటి కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.బాణాసంచా తయారీకి సంబంధించిన కేంద్రాలు అధికారుల అనుమతులతో మాత్రమే నడపాలి అని పేలుడు పదార్థాలు నిల్వ చేసేటప్పుడు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలి అని అనుమతులు లేని వారు తయారీ లేదా విక్రయాలు చేపడితే ఎక్సప్లసివేస్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి,అక్రమ బాణాసంచా తయారీ లేదా నిల్వ జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే డయల్ 112 కు లేదా నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలని



కోరారు.బాణసంచా తయారీ కేంద్రాల వద్ద సదర్ కేంద్రాల యొక్క యజమానులు ఇసుక ను నీటిని అందుబాటులో ఉంచాలని ఎటువంటి ప్రమాదాలు సంభవించిన ఎదుర్కోవడానికి కావలసినటువంటి చర్యలను తీసుకోవాలని అని 18 సంవత్సరాల లోపు మైనర్ యొక్క బాలబాలికలను తయారీ కేంద్రాల వద్ద లేదా విక్రయాల వద్ద వినియోగించ రాదని దానికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించన యెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకొనబడతాయని హెచ్చరికలు జారీ చేసినారు.ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత బాధపడే కంటే జరగకుండా తగిన చర్యలు తీసుకొనడం చాలా శ్రేయస్కరమని ప్రజల యొక్క ప్రాణ నష్టం గానీ ఆస్తి నష్టం కాని జరగకుండా ప్రభుత్వం వారి యొక్క అనుమతులు పొందిన వారి మాత్రమే బాణసంచా నిలువలు గాని తయారీ గాని చేయాలని,ఇన్స్పెక్టర్ ప్రజలకు సూచించారు ...

# బాల్యవాహాలు,సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీ.ఐ గోపి






**శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు(శుభోదయం న్యూస్):**

బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై విద్యార్థునులకు అవగాహన అవసరమని ఒకటవ పట్టణ సిఐ గోపి తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్లో విద్యార్థినులకు పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ బాల్య వాహాల వలన జరిగే నష్టాల గురించి తెలియ జేశారు. సెల్ ఫోన్ వలన సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని సైబర్ నేరాలకు కొంతమంది వ్యక్తులు పనిగట్టుకుని ఈ నేరాలు చేస్తున్నారని అన్నారు.ఇటువంటి మోసాలకు పునరావృత్తం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మారుతున్న కాలాలగుణంగా చైతన్య వంతం కావాలని అన్నారు. మహిళలు, చిన్న పిల్లలపై నేరాలు ఎక్కువయ్యాయన్నారు. విశృంకల పాశావికమైన ఆలోచనల విధానాల వలన ఇటువంటివి చోటు చేసుకుంటున్నా యని, వీటి కట్టడికి చట్టాల ద్వారానే కాక మానవుల మనస్సుల్లో మార్పు రావాలన్నారు.ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి ఈ కేవైసీతప్పని సరి

**ఏపీవో నరసింహులు**

**సిద్ధవటం మండల, విలేకరి జాకీర్ హుస్సేన్(శుభోదయం న్యూస్):**


మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ శ్రామికులకు ముఖ్యమైన సందేశం ఏమనగా!కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిబంధనల ప్రకారం మీ యొక్క జాబ్ కార్డు(ఉపాధి పని బుక్) లో ఎంత మంది పేర్లు ఉంటే వాళ్ళందరూ కూడా ఈ కేవైసీ ఖచ్చితంగా చేయించుకోవాలి. ఒకవేళ ఈ కేవైసీ చేయకపోతే మీ జాబ్ కార్డు ఉపయోగంలో ఉండదు మరియు ఉపయోగంలో లేని జాబ్ కార్డును శాశ్వతం గా తొలగించబడుతుంది.మీరు ఎక్కడ ఉన్న మీ స్వగ్రామానికి వచ్చి ఈ కేవైసీ తప్పకుండా చేయించుకోవాలి. జాబ్ కార్డ్ లేకుండా ఉపాధి హామీ పథకం లో వ్యక్తిగత (పండ్ల తోటల పెంపకం,ఇంటి నిర్మాణం,గడ్డి పెంపకం మొదలగు )పనులు లబ్ధి పొందడం వీలుపడదు. ఈ కేవైసీకి సంబంధించి ఈ కేవైసీమీ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ను సంప్రదించగలరు. ఈ సందేశం అన్ని గ్రూప్ ల లో ఉపాధి




శ్రామికులకు తెలిసే విదంగా షేర్ చేయగలరని మనవి.

## జాజం వారి వివాహ హల్దీ వేడుకలో పాల్గొన్న ఇంచార్జ్ డా .దద్దాల

**పామూరు మండలం, రిపోర్టర్ బండి రమేష్(శుభోదయం న్యూస్):**



పామూరు టౌన్ వైఎస్ఆర్ సీపీ నాయకురాలు జిల్లా మహిళా కార్యదర్శి గాయక వాడ సుహాసిని గారి తమ్ముడు చి!!జాజం సురేష్ వివాహ హల్దీ వేడుకలో పాల్గొని ఆశీర్వదించి ముందస్తు శుభాకాంక్షలు తెలిపిన కనిగిరి వైఎస్ఆర్ సీపీ ఇన్చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఈ వేడుకలో నాయకులు గంగసాని హుస్సేన్ రెడ్డి, చప్పిడి సుబ్బయ్య, కల్లూరి రామిరెడ్డి,గట్ల విజయభాస్కర్ రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, కటికల వెంకటరత్నం, శ్రీరామ శ్రీనివాసులు, జొన్నలగడ్డ గోవిందయ్య, ఓరుగంటి పద్మ, పాలేటి ప్రేమ్, వెంకటసుబ్బలు, జాజం శ్రీకాంత్, సాయి, శివాజీ, సుబోజి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిగా నేడు 15 ఏళ్ళ మైలురాయిని చేరుకున్న చంద్రబాబు నాయుడు

**సీఎం చంద్రబాబు కు అభినందనలు తెలిపిన ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ - కొవ్వాసు**

**పోలవరం, ప్రతినిధి(శుభోదయం న్యూస్):**



1995 సెప్టెంబర్ 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు తొలిసారి ముఖ్యమంత్రి అయిన నారా చంద్రబాబు నాయుడు రెండు పర్యాయాలుగా 8 సంవత్సరాలు 255 రోజులు సీఎంగా పనిచేసారు. ఈ సందర్భంగా ఎపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి మాట్లా డుతూ మూడోసారి 2014లో నవ్యాంధ్ర సీఎంగా 1816 రోజులు, తిరిగి ఇప్పుడు నాలు గోసారి ముఖ్యమంత్రిగా గత 485 రోజులుగా పనిచేస్తున్నారని మొత్తం మీద సీఎంగా నేటితో సరిగ్గా 15 ఏళ్ళ మైలురాయిని దాటుతున్నారని, ఏపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పేర్కొన్నారు. నిత్య కృషీవలుడు, అలుపెరగని పోరాటయోధుడు, ప్రజల మనిషి, అభివృద్ధి ప్రదాత, సంక్షోభాన్ని సంక్షేమంగా మార్చే మేధావి, సంపద సృష్టికర్త, తెలుగుప్రజల నమ్మకం, జనం మెచ్చిన నాయకుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు హృదయపూర్వక అభినందనలు తెలిపిన కొవ్వాసు జగదీశ్వరి తెలిపారు.

## రామాలయం విగ్రహాలు మాయం

**24 గంటల్లో నిందితులు అరెస్టు చేసిన చింతలపూడి పోలీస్**

**ఏలూరు జిల్లా, ప్రతినిధి- ప్రసాద్(శుభోదయం న్యూస్):**



ఏలూరు జిల్లా చింతలపూడి మండలం రెచర్ల పంచాయతీ రెండవ మైలు తండా వద్ద ఉన్న రామాలయం నుండి నిన్న విగ్రహాలు మాయమయ్యాయి.రామాలయం తన సొంత స్థలంలో ఉందని చెప్పి, గుడిలోని విగ్రహాలను తొలగించి మాయం చేసినట్టు చింతలపూడి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదయింది.ఈ ఘటనలో గ్రామానికి చెందిన దారావతు బాలు, దారావతు మంగమ్మ, దారావతు కృష్ణమూర్తి ప్రధాన నిందితులుగా గుర్తించబడ్డారు. ఫిర్యాదుదారుడు ధరవతు దీప్లి ఆయనపై ఫిర్యాదు చేశారు.సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్, సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు, నిందితులను అరెస్ట్ చేసి, దర్యాప్తు భాగంగా మాయం అయిన విగ్రహాలను చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం ప్రాజెక్ట్ సమీపంలో స్వాధీనం చేసుకున్నామని చింతలపూడి పోలీసు వారు తెలియజేశారు

## దూరవిద్య డిగ్రీ దరఖాస్తులకు ఆహ్వానం కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ

**గుంతకల్లు, ప్రతినిధి పల్లె రామాంజనేయులు(శుభోదయం న్యూస్):**



ఆంధ్ర యూనివర్సిటీ దూరవిద్య ద్వారా డిగ్రీ పీజీ కోర్సులకు ఈనెల 15 వరకు చివరి తేదీ ఉందని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ దూర విద్యలో బిఏ బీకాం బీఎస్సీ బిబిఎం తోపాటు పీజీ లో ఎం ఏ ఎం కామ్ ఎంఎస్సీ ఎంబీఏ కోర్సులు కూడా ఉన్నాయని ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు ఈనెల 15వ తేదీ చివరి వరకు ఉందన్నారు మిగతా వివరాలకు తన సెల్ నెంబర్ 9701263319 కు కాల్ చేసి అడగవచ్చు అన్నారు

## పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

పోలవరం ప్రతినిధి(శుభోదయం న్యూస్):



పోలవరం ప్రాజెక్టును శుక్రవారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సందర్శించి, జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రాజెక్టు పనుల అమలుపై సంబంధిత అధికారుల నుండి వివరణాత్మక సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ "పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మీయ స్వప్నం అని, ఈ ప్రాజెక్టు రాష్ట్ర అభివృద్ధికి కీలకమైనదని ప్రాజెక్టు పనులు వేగంగా నాణ్యతతో సాగుతున్నాయన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తోందని ప్రజలకు త్వరలోనే ప్రాజెక్టు లాభాలు అందేలా చర్యలు తీసుకుంటాం" అని అన్నారు. ప్రాజెక్టు పనుల నాణ్యత, వేగం, సాంకేతిక అంశాలపై ఎమ్మెల్యే సూచనలు చేశారు. అవసరమైన చోట్ల తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి

పోలవరం ప్రతినిధి (శుభోదయం న్యూస్):



జీలుగుమిల్లి జనసేన నాయకుడు నెట్టెం అనిల్ సోదరి వివాహ రిసెప్షన్ మహోత్సవంలో పాల్గొన్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు. అశ్వారావుపేట లో జరిగిన వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నూతన వధూవరులను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండిపోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్, జీలుగుమిల్లి మండల అధ్య క్షుడు పసుపులేటి రాము, బుట్టాయిగూడెం మండల అధ్యక్షుడు బుచ్చిరాజు, కూటమి నాయకులు పేరాబత్తుల డేవిడ్ రాజ్,వీరాబత్తుల ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా పై దాడులు మరియు మద్యం షాపులు పై ఆకస్మిక తనిఖీలు

ఏలూరు జిల్లా, ప్రతినిధి- ప్రసాద్(శుభోదయం న్యూస్):



డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ ,ఏలూరు శ్రీమతి. బి.శ్రీలత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఏలూరు శ్రీ. కె.వి.ఎన్.ప్రభు కుమార్ మరియు డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్, ఏలూరు జిల్లా ఏలూరు శ్రీ. ఏ.ఆవులయ్య వారి ఆదేశాలు ప్రకారము చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ అధికారులు మరియు సిబ్బంది కలిసి చింతలపూడి మండలం లో గల ఎర్రగుంటపల్లి గ్రామము లో ఎక్సైజ్ నేరములు కొరకు దాడులు నిర్వహించగా చవటపల్లి మరియమ్మ వద్ద నుండి (2) లీటర్లు నాటు సారాయి ను స్వాధీన పరచుకొని ఆ మహిళ పై కేసు నమోదు చేయడమైనది! అలాగే ఈ రోజు చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధి లోని పలు మద్యం షాపులను మరియు ఒక రెస్టారెంట్ అండ్ బార్ ను ఆకస్మిక తనిఖీ లు నిర్ణయించి ఎక్సైజ్ షాపు మరియు బార్ రూల్స్ లను తప్పనిసరిగా పాటించవలసినదిగా, సూచించడమైనది! ఈ దాడులలో స్థానిక చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఎస్.ఐ.అబ్దుల్ ఖలీల్ జె.జగ్గారావు మరియు సిబ్బంది పాల్గొన్నారని చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ సి.ఐ.పి.అశోక్ తెలిపినారు

## ఏలూరు వైన్ షాప్ పర్మిట్ రూమ్ మరణం

**మద్యం కారణం కాదని ప్రాథమిక నివేదిక**

ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్ (శుభోదయం న్యూస్ ):



ఏలూరు నగరంలోని జివి మాల్ పక్కన ఉన్న లేన్‌లోని ఎస్.ఆర్. వైన్స్ షాప్‌లో గురువారం ఉదయం ఒక వ్యక్తి అకస్మాత్తుగా మృతి చెందారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, అతనిని మేకా అనిల్ గా గుర్తించారు. వయస్సు 40 సంవత్సరాలు ఉండవచ్చని భావిస్తున్నారు. ఆ వ్యక్తి ఉదయం 10:40 గంటలకు షాప్‌లోకి వెళ్లి, రూ.99 రేటు ఉన్న రాయల్ లాన్సర్ విస్కీ బాటిల్ కొనుగోలు చేసి, అక్కడే మృతి చెందారు. ఎక్సైజ్ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, ఈ మృతి నకిలీ మద్యం వల్ల జరిగినది కాదు. వ్యక్తి తీసుకున్న మద్యం పూర్తిగా ప్రభుత్వం అనుమతించిన సరఫరా నుండి సదరు వైన్ షాపు కు వచ్చింది, దానికి సంబంధించి అన్ని రికార్డులు స్పష్టంగా ఉన్నాయి. చనిపోయిన వ్యక్తి తీసుకున్న మద్యం బాటిల్ తో పాటు ముందు, వెనుక నమూనాలు కూడా తనిఖీ కి పంపారు. ల్యాబ్ పరీక్షల్లో, మద్యం నిర్దేశించిన ప్రమాణాల మేరకు తయారు అయ్యిందన్న విషయం స్పష్టం అయ్యింది. నిజానికి ఈ సీరియల్ నంబర్ కలిగిన 15 కేసుల మద్యం సదరు వైన్ షాపు నుండే విక్రయం జరిగింది. వీటికి సంబంధించి ఎటువంటి ఇబ్బంది ఎదురు కాలేదు. మరో వైపు జిల్లా వ్యాప్తంగా వివిధ వైన్ షాపులకు కూడా ఇదే బ్యాచ్ మద్యం సరఫరా అయ్యింది. ఫలితంగా ఇది సేవనానికి అనుకూలమైనవిగా నిర్ధారించారు. శవ పరీక్ష రేపు నిర్వహించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని పోలీస్ శాఖ స్పష్టం చేసింది . పోస్ట్ మార్టం అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు

# మళ్లీ మొదలైన జడ్పీ బాయ్స్ హై స్కూల్ ప్రహరీ ఆవరణంలో కూరగాయల బండ్లు






గోడకే పరిమితమైన నో పార్కింగ్ బోర్డు

శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్):

పట్టణంలోని జడ్పీ బాయ్స్ హై స్కూల్ ప్రహరీ గోడ ఆవరణంలో మరల కూరగాయల బండ్ల వ్యాపారాలు మొదలయ్యాయి. గత నెలలో ప్రజా సమస్యల వినతల స్వీకరణ కార్యక్రమం పంచాయతీ రాజ్ అతిథి గృహంలో కలెక్టర్ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆరోజు నుండి పోలీసు ఉన్నతాధికారులు చొరవ తీసుకుని జడ్పీ బాయ్స్ హై స్కూల్ విద్యార్థులు పట్టణవాసులు కూరగాయల బండ్లు వలన తీవ్ర ట్రాఫిక్ అంతరాయం, విద్యార్థులకు పలు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రహించి ప్రహరి గోడ పక్కనే ఉన్న వాహనాలు, కూరగాయల బండ్లులను తొలగించడం జరిగింది. ట్రాఫిక్ పోలీసులు ప్రతిరోజు పర్యవేక్షిస్తూ ఉండేవారు.అయితే కొద్ది రోజుల నుంచి టమాటా వాహనాలు ఒక్కొక్కటిగా మరలా తిరిగి యధాస్థితికి రోడ్లు పైనే నిలిపి వ్యాపారాలు సాగిస్తున్నారు. విద్యార్థులు, పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు స్పందించి ఈ రోడ్డుపై నిలుపుతున్న వాహనాలపై తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ,పట్టణవాసులు కోరుతున్నారు..

# ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన సర్కిల్ ఇన్స్పెక్టర్. భీమా నాయక్ మరియు సబ్ఇన్స్పెక్టర్ టి. కిషోర్ బాబు

పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్):



ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ వి.హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, జిల్లా పోలీసులు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా పామూరు మరియు కనిగిరిలో పరిసర ప్రాంతాలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో డాగ్ స్క్వాడ్ పేలుడు పదార్థాలు, గంజాయి కనుగొనేందుకు జాగిలం-చీతతో పాటు స్థానిక పామూరు మరియు కనిగిరి పోలీస్ అధికారులు పాల్గొన్నారు.పామూరు ఆర్టీసీ బస్టాండ్ మరియు పార్శిల్ సెంటర్ లలో అలాగే ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో అనుమానాస్పద వస్తువులు, లగేజీలను మరియు పార్కింగ్ ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.కనిగిరిలో కార్గో పాయింట్, కార్ స్టాండ్, మరియు మంగళమాన్యం, దరువు, గార్లపేట ప్రాంతాలలో ఉన్న గంజాయి వ్యాపారుల అనుమానిత ఇళ్లలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. క్రాంతి మరియు నవత ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు మరియు ఇతర అనుమానాస్పద ప్రదేశాలలో కూడా తనిఖీలు నిర్వహించారు. పామూరు మరియు కనిగిరి బస్టాండ్ లోపల ప్రయాణీకుల బ్యాగులను పరిశీలించగా, అనుమానం కలిగిన ప్రయాణికుల బ్యాగులను ఓపెన్ చేయించి చెక్ చేశారు. అలాగే, అనుమానాస్పదంగా కనిపించిన ప్రయాణికుల గుర్తింపు కార్డులపై ఉన్న చిరునామాలను పరిశీలించి వారి వివరాలను సేకరించారు.బస్టాండ్ లోని పార్సిల్ సర్వీస్ సెంటర్‌లను తనిఖీ చేసిన పోలీసులు, నిబంధనలకు విరుద్ధంగా వచ్చే పార్సిళ్లను స్వీకరించవద్దని అక్కడి సిబ్బందికి సూచించారు. అనుమానాస్పద పార్సిళ్లు కనిపించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పటిష్టమైన భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ తనిఖీలలో పామూరు ఇన్స్పెక్టర్ భీమా నాయక్, కనిగిరి ఇన్స్పెక్టర్ ఖాజావలి, పామూరు ఎస్సై కిషోర్, కనిగిరి ఎస్సై శ్రీరామ్, డాగ్ హ్యాండ్లర్ విద్య సాగర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కృష్ణారావుపాలెం నుండి మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్ కు బస్సు సౌకర్యం కల్పించిన మంత్రి





చాట్రాయి మండల రిపోర్టర్ చంద్రశేఖర్ (శుభోదయం న్యూస్):

ఏలూరు జిల్లా నూజివీడు నియోజక వర్గం చాట్రాయి మండలం కృష్ణారావు పాలెం గ్రామం నుండి మంగళగిరి ఎయిమ్స్ హాస్పటల్ వరకు బస్సు సౌకర్యం కల్పించినట్లు దీనిని చనుబండ చుట్టుపక్కల గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి సీనియర్ నేత నక్క రాము ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నూజివీడు ఎమ్మెల్యే గృహ నిర్మాణ మరియు సమాచారశాఖ మాత్యులు పార్థసారధి ఇచ్చిన మాట ప్రకారం ది:13 -10 -2025 తారీఖు ఉదయం 5:45 నిమిషాలకు కృష్ణారావు పాలెం నుండి చనుబండమీదుగా సూరంపాలెం, నర్సాపురం విస్సన్న పేట వరకు అక్కడ నుండి ప్రపంచ ప్రఖ్యా తిగాంచిన మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్ కు వెళుతుందని తెలిపారు. ఈ అవకాశాపహన్ని మహిళలు శ్రీ శక్తి పథకంలో భాగంగా ఉచితంగా ప్రయాణం చేయవచ్చునన్నారు. మంత్రిగారు ఇచ్చిన మాటనిల బెట్టుకున్నందుకు కృష్ణారావుపాలెం చనుబండ నరసింహారావుపాలెం పర్వతాపురం, ఎన్టీఆర్ జిల్లాలోని కొర్లమండ వేమిరెడ్డిపల్లి ,కలగర పంచాయతీ ప్రజలుహర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చుట్టుపక్క గ్రామాల ప్రజలకు ఈబస్సుఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,ఈ ఆలోచనను మంత్రిపార్ధసారది దృష్టికి తీసుకు వెళ్ళిన నక్కా రాముకు అడిగిన వెంటనే నూజివీడు ఆర్టీసీ మేనేజర్ తో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించిన మంత్రి వర్యులు పార్ధ సారదికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బస్సు రాత్రి 8 -20 నిమిషాలకు సూరం పాలెం చనుబండ మీదుగా కృష్ణారావు పాలెం వస్తుందనీ,నక్కారాము తెలిపారు.ప్రజల అవసరాలు గుర్తించి ఇలా సకాలంలో పనులు చేస్తున్న మంత్రి కి చనుబండ చుట్టు పక్క గ్రామాల ప్రజలు మరియు నాయకులు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నారు.

# ఏలూరు జిల్లా లిబరేషన్ మహాసభలు

చాట్రాయి మండలం, రిపోర్టర్ చంద్రశేఖర్(శుభోదయం న్యూస్):



ఏలూరు జిల్లా మండలంలో సిపిఐ ఎంఎల్ లిబరే షన్ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి పుల్లారావు విజ్ఞప్తి చేశారు. చాట్రాయి మండలంలో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు నూజివీడులో నవంబర్ ఒకటో తేదీన మహాసభలు జరుగుతున్నట్టు అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం మండల కార్యదర్శి బంటు పూజిత తెలిపారు. ఎన్డీఏ కూటమి 15 నెలల పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యం అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చి నేడు అదే చట్టాన్ని మరో రూపంలో ప్రజల భూములను కార్పోరేట్లకు కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారని ఐఫ్వా జిల్లా కమిటీ సభ్యురాలు పరికల కళావతి విమర్శించారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఏలూరు జిల్లా కార్యదర్శి డి పుల్లారావు మాట్లాడుతూ కార్మికుల పని గంటలు పెంపుని వ్యతిరేకించాలని కోరారు. నూజివీడులో నవంబర్ ఒకటోతేదీనమహాసభలు జరుగుతున్నట్టు తెలిపా ఈ కార్యక్రమంలో పి కళావతి, బి పూజిత, బి సీతామహాలక్ష్మీ, డి పుల్లారావు పాల్గొన్నారు.

# కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల

శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్):



శ్రీకాళహస్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి, కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ం కార్యకర్త ఖాదర్ భాషా కి అరుదైన గౌరవం దక్కిందని, సామాన్యమైన వ్యక్తికి ఇంతటి పదవి ఇవ్వడంతొ పట్టణ వాసులు హార్షం వ్యక్తం చేసారు. శ్రీకాళహస్తి ప్రజలు నిజాయితీకే బొజ్జల కుటుంబం పెద్ద పీట వేస్తారని మరోసారి రుజువు చేశారు. ఎమ్మెల్యే మైనారిటీలను చైర్మన్గా చేసినందుకు ముస్లిం మైనారిటీ సోదరులు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మా నాన్న నుంచి మా కుటుంబానికి అండగా ఉండి టీడీపీ పార్టీకి విధేయుడుగా ఉన్న సీనియర్ కార్యకర్త అతి సామాన్యమైన వ్యక్తి మా కుటుంబ సభ్యుడైనటు వంటి ఖాదర్ భాషా ని చైర్మన్గా చూడడం చాలా సంతోషంగా ఉందని అదేవిధంగా డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేసిన మాతోటి కుటుంబ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు, టౌన్ బ్యాంక్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించి బ్యాంకు అభివృద్ధికి పాటుపడి తద్వారా శ్రీ కాళహస్తి ప్రజలకు లబ్ధి చేకూరేలా పనిచేయాలని కోరారు.ఇదే రీతిలో రాబోయే రోజులలో కూడా కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని ప్రతి ఒక్కరిని ఉన్నత స్థాయిలో నిలబెడతానని తెలిపారు. కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలక మండలి వివరములు ఎస్.ఖాదర్ బాషా చైర్మన్, డైరెక్టర్లు ఏ.మురళి, ఎం. దొరబాబు, ఏ.బాబు, పి.ఆర్ముగం, పి. రాంబాబు, కే.అనిల్ కుమార్, ఎన్.గోవర్ధన్, పి.కవిత,బాధ్యతలు చేపట్టడం జరిగింది..

# మరమ్మతుకు గురైన ఆర్ అండ్ బి రోడ్డు






గాలిలో కలిసిపోతున్న ద్విచక్ర వాహనదారుల ప్రాణాలు

శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్):

శ్రీకాళహస్తి పట్టణం నుంచి పల్లం వరకు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు విస్తరణ పనులు చేసి అరకొర విస్తరణ చేసి కాంట్రాక్టర్ కు నిధులు మంజూరు కాలేదని ఆర్ అండ్ బి అధికారులు తోసిపుచ్చుతున్నారు. ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు అందువలన పెద్ద పెద్ద వాహనాలు వేగంగా ప్రయాణించి చిన్న వాహనాలను ఢీకొనడం వలన వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి.ఈ విషయమై పలుమార్లు వార్తాపత్రికలలో ప్రచురించినప్పటికీ ఆర్ అండ్ బి అధికారుల నుండి ఎలాంటి స్పందన లేదు.అందువలన ద్విచక్ర వాహదారుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. శ్రీకాళహస్తి బైపాస్ నుండి దొమ్మరపాలెం వరకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు భారీగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో నిత్యం వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో తొట్టంబేడు మండలానికి చెందిన చిన్న పసికందు, పసికందు తండ్రి ప్రాణాలు వదిలారు. ఇలా వరుస ప్రమాదాల జరుగుతున్నాయి.ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో శ్రీకాళహస్తి పట్టణానికి అనుకొని ఉన్న అరవ కొత్తూరు గ్రామ సమీపంలో ఒక టిప్పరు, ద్విచక్ర వాహనం యాక్సిడెంట్ జరిగింది. ఇందులో ద్విచక్ర వాహనం నడుపుతున్న గురువయ్య అతని భార్య స్వాతి వారి యొక్క ఆరు సంవత్సరాల బాబు ప్రయాణిస్తూ ఉండి టిప్పర్ గుద్దడంతో కిందపడిన గురువయ్య భార్య స్వాతి(30) అక్కడికక్కడే చనిపోయినది.వీరు శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని ఉడుములపాడు గ్రామం చెందినవారు .పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ అధికారుల నిర్లక్ష్యం వలన ఇంకా ఎంతమంది వాన దారుల ప్రాణాలు పోగొట్టుకోవాల్సిందని ప్రజలు వాపోతున్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యం శుక్రవారం సభలో కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్** : మనం పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. పోషణ మాసంలో భాగంగా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కోతిరాంపూర్ హై స్కూలులో శుక్రవారం సభ, విద్యార్థులతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు.దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.పోషకాహారం పై అవగాహన పెంచుకొని వంట చేయాలని మహిళలకు సూచించారు.మనం తినే ఆహారం ద్వారా అందే పోషకాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.ఈ రోజుల్లో చాలామంది అధిక బరువు తో బాధపడుతుండటానికి ప్రధాన కారణం అధికంగా నూనె, తీపి వినియోగిం చడమేనని పేర్కొన్నారు.తక్కువ అన్నం ఎక్కువ కూరలు తీసుకోవాలన్నారు.లింగ వివక్ష చూపకుండా పిల్లలకు ఇంటి పనులు, వంట పనులతో పాటు ఆరోగ్యకర ఆహారం తయారు చేసే వండే, విధానం నేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.పాలిచ్చే తల్లులు తప్పనిసరిగా ఐరన్ కాల్షియం, మాత్రలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుప్రత్రుల్లో ఐరన్, కాల్షియం మాత్రలు ఉచితంగా ఇస్తారని30 ఏళ్లు దాటిన మహిళలు ఆరు నెలలకు ఒకసారి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లిబివైద్య పరీక్షలు చేయించుకుంటూ అవసరమైన మాత్రలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు ఫుడ్ ఫెస్టివల్ లో భాగంగా విద్యార్థులు ఆకుకూరలు, కూరగాయలతో తయారు చేసిన ఆహార పదార్థాల ప్రదర్శనను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహార పదార్థాల ప్రయోజనాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేను సైతం ఎన్జీవో ఆధ్వర్యంలో ఫెస్టివల్ లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం చిన్నారుల కు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఆకట్టుకున్న హెచ్ఎం పాట:కలెక్టర్ పాలనను, జిల్లాలో ప్రవేశపెట్టిన కార్యక్రమాలను వివరిస్తూ పాఠశాల హెచ్ఎం ఆలపించిన పాట అందర్నీ ఆకట్టుకుంది.కార్యక్రమంలో డీఎంహెచ్వో వెంకటరమణ, సీడీపీఓ సబిత మెప్మా పిడి స్వరూప రాణి, వైద్యాధికారి సనా, ఎన్జీవో ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

## షాట్ పుట్ లో జిల్లా స్థాయికి ఎన్నికైన యశ్వంత్ రాయల్

తనకల్లు, రిపోర్టర్ రవీంద్ర(శుభోదయం న్యూస్) :





స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడలలో షాట్ పుట్ లో శ్రీ శారద విద్యా మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కు చెందిన యశ్వంత్ రాయల్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ సనత్ కుమార్ తెలిపారు. మరియు 100 మీటర్ల పరుగుపందెం లో అదే పాఠశాల చెందిన సృజన్ జిల్లా స్థాయికి ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పిఈటి మురళి పాల్గొన్నారు.

## కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్):



మాజీ శాసన సభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్ను నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడంపై ప్రజా అభిప్రాయం తెలుసుకోవడానికి కోటి సంతకాలను సేకరణ కార్యక్రమం ప్రారంభిస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో అంజూరు.తారక శ్రీనివాసులు,ఉన్నం.వాసుదేవ నాయుడు,వయ్యాల.కృష్ణారెడ్డి,చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, గున్నేరీ కిషోర్ రెడ్డి,కోగిలి సుబ్రహ్మణ్యం,,షేక్ సిరాజ్ భాష,సురావారి సురేష్ ,ముని కృష్ణారెడ్డి, పులి రామచంద్ర, మురళి, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తంగేళ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంక్ ను సందర్శించిన ఆర్.సి.ఎస్ ఇన్చార్జ్ బి.నందకిషోర్

తొట్టంబేడు, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్):



తంగెళ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు పరపతి సంఘాన్ని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆర్.సి.ఎస్ ఇన్చార్జి బి. నంద కిషోర్ ఆయన బృందం సందర్శించారు. వారికి తంగేళ్లపాలెం సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ ముదిరాజ్ స్వాగతం పలికారు. తిరుపతి లో సదస్సుకు హాజరైన వీరు చివరి రోజు తంగెళ్లపాలెం పీ.ఏ.సీ.ఎస్ కు వచ్చారు..అక్కడి వ్యాపార లావాదేవీలను, ఈకేవైసీ నమోదు, రుణపంపిణీ, హార్డ్వేర్ కిట్లు తదితరాలను పరిశీలించారు. టెక్నాలజీ వినియోగం గురించి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ భాస్కర్ ముదిరాజ్ జిల్లా సహకార అధికారి నాగవర్ధన, డిసిఏఓ బ్రహ్మానంద రెడ్డి,డిఎల్సిఓ జె.సురేష్ కుమార్,అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.నాగభూషణం సంఘ అధ్యక్షులు బి. భాస్కర్, సంఘ సీఈవో పి.చిరంజీవి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పి

నల్లచెరువు, మండలం, రిపోర్టర్ - మాలిక్ బాషా(శుభోదయం న్యూస్):



శ్రీ సత్యసాయి జిల్లా యస్.పి సతీష్ కుమార్ శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లోని కేసులు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు.మండల పరిధిలో గల కేసులు గురించి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉన్న కేసులును వెంటనే పరిష్కరించాలని సూచించారు.సమాజానికి హాని కలిగించె వారి పై ప్రత్యేక నిఘా సారించాలన్నారు.మండలంలో శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే వారు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. దొంగతనాలు,ఇతర నేరాలను నియంత్రించడానికి గస్తీని మమ్మురం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అసాంఘిక కార్యక్రమాలు,పేకాట,గంజాయి, వంటి వాటిని అరికట్టే చర్యలు తీసుకోవాల న్నారు.కార్యక్రమంలో డీఎస్పీ శివ నారాయణస్వామి, సీఐ నాగేంద్ర,ఎస్పై మక్బూల్ బాషా,స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకులు భద్రతా చర్యలు చేపట్టాలి. ఎస్సై గోపి

తనకల్లు, రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్):




తనకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని బ్యాంకుల భద్రతా చర్యలపై, బ్యాంక్ దొంగతనాలు లేదా చోరీలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, తనకల్లు ఎస్సై గోపి తెలిపారు. తనకల్లు మండల పరిధిలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్లకు సెక్షన్ 168 ప్రకారం నోటీసు ఇవ్వడం అయినది బ్యాంకులలో సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలనీ, భద్రతా సిబ్బందిని నియమించు కోవాలనీ, అలారం వ్యవస్థలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలనీ సూచించారు.ఈ చర్యలు ప్రజా ఆస్తి మరియు బ్యాంకు భద్రత దృష్ట్యా తీసుకుంటున్నామని, అన్ని బ్యాంకులు తగిన భద్రతా చర్యలు చేపట్టి సహకరించాలని ఆయన కోరారు.

# రూ.500 కోట్ల క్లబ్‌లో 'కాంతార చాప్టర్ 1'.. బాక్సాఫీస్ దగ్గర మాస్ ఊచకోత



కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన కాంతార చాప్టర్ 1 చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. కాంతార సినిమాకు ప్రీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. మొదటిరోజు నుంచే బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న ఈ చిత్రం తాజాగా మరో అరుదైన రికార్డును అందుకుంది. విడుదలైన 9 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.509 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. మరోవైపు ఈ వీకెండ్ కూడా థియేటర్‌లలో పెద్ద సినిమాలేవి లేకపోవడంతో కాంతార మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశం ఉంది.

# హారర్ థ్రిల్లర్ 'కిష్కింధపురి'.. ఓటీటీ, టెలివిజన్ రిలీజ్ డేట్ ఇదే!



యువ కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'కిష్కింధపురి'. ఈ సినిమాకు కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించగా.. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించింది. హారర్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం మిరాయ్‌కి పోటిగా సెప్టెంబర్ 12న వచ్చి సూపర్ హిట్‌ను అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో ఈ సినిమా అక్టోబర్ 17 నుంచి తెలుగులో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మరోవైపు దీపావళి కానుకగా అక్టోబర్ 19న ఈ చిత్రం టెలివిజన్ జీ తెలుగులో సాయంత్రం 6 గంటలకు ప్రసారం కాబోతున్నట్లు నిర్వహాకులు వెల్లడించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. రాఘవ్ (బెల్లంకొండ సాయి శ్రీనివాస్), మైథిలి (అనుపమ) ఘోస్ట్ వాకింగ్ పేరుతో హాంటెడ్ హౌస్ టూర్స్ నిర్వహిస్తుంటారు. అలా 11 మందితో కలిసి పాడుబడిన సువర్ణమాయ రేడియో స్టేషన్‌కి వెళ్తారు. అక్కడ వేదవతి అనే ఆత్మ వాయిస్ వినిపిస్తుంది. లోపలికొచ్చిన వారందరినీ వదిలిపెట్టనని హెచ్చరిస్తుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అసలు వేదవతి ఎవరు? ఎందుకు ఆత్మగా మారింది? సువర్ణమాయ నుంచి బయటపడటానికి రాఘువ్ ఎలాంటి ప్రయత్నాలు చేశాడనేది మిగతా కథ.

# ఆ.. అవకాశం రావాలని కోరుకుంటున్నా

'ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి ఉన్నప్పుడు ట్రై యాంగిల్ లవ్ స్టోరీ అనుకుంటారు. కానీ 'తెలుసు కదా'లో ఒక యూనిక్ పాయింట్‌ని టచ్ చేశాం. అది ఇప్పుడు రివీల్ చేయకూడదు. సినిమా చూసినప్పుడు ప్రేక్షకులు ఖచ్చితంగా సర్‌ప్రైజ్ అవుతారు' అని కథానాయిక శ్రీనిధి శెట్టి అన్నారు. 'మిరాయ్' లాంటి పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా'. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. స్టైలిస్ట్-ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వంలో టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈనెల 17న సినిమా విడుదల కానున్న సందర్భంగా నాయిక శ్రీనిధి శెట్టి మీడియాతో ముచ్చటించారు. ఫస్ట్ టైం లవ్ స్టోరీ చేయటం చాలా హ్యాపీగా ఉంది. నాకు రొమాంటిక్ స్టోరీస్ చేయడం ఇష్టం. 'కేజీఎఫ్, హిట్ 3' యాక్షన్, చాలా బ్లడ్ బాత్ ఉన్న సినిమాలు. 'తెలుసు కదా' ఒక లైట్ హార్టెడ్ మూవీ. చాలా కొత్తగా ట్రై చేశాం. ఇందులో లవ్, ఎమోషన్, లాఫ్, సాంగ్స్.. అన్ని కమర్షి యల్ ఎలిమెంట్స్ ఉంటాయి. సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ మంచి రొమాంటిక్ డ్రామాని ఫీల్ అవుతారు.దర్శకురాలు నీరజ చాలా ప్యాషన్‌తో సినిమా చేశారు. ఆమె విజన్ ఆడియన్స్‌కి ఖచ్చితంగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమాలో ఉన్న స్పెషాలిటీ ఏంటంటే, ఇదొక మంచి ఫీల్ గుడ్ ఎంటర్టైనర్. ఇందులో చాలా కొత్త పాయింట్ వుంది. ఇందులో మూడు క్యారెక్టర్స్ ఆడియన్స్‌కి బాగా కనెక్ట్ అవుతాయి. థియేటర్స్‌లో చూస్తున్నప్పుడు ఎంజాయ్ చేస్తారు. ముఖ్యంగా సిద్ధు క్యారెక్టర్‌ని చాలా ఎంజాయ్ బాగా చేస్తారు.



# ఫ్యామిలీస్టార్' తర్వాత విజయ్, దిల్ రాజు కొత్త సినిమా



విజయ్ దేవరకొండ దిల్ రాజు కలిసి మరోసారి పనిచేయనున్నారు. వీరిద్దరూ కలిసి ఇప్పటికే ఫ్యామిలీస్టార్ సినిమాను అందించారు. దర్శకుడు పరశురామ్ తెరకెక్కించిన ఈ చిత్రం అనుకున్నంత రేంజ్‌లో అయితే మెప్పించలేదు. అయితే, మరోసారి విజయ్ దేవరకొండతో కలిసి ఒక ప్రాజెక్ట్ చేస్తానని నిర్మాత దిల్‌రాజు గతంలోనే ప్రకటించారు. ఈ క్రమంలోనే సరికొత్తగా యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. విజయ్ దేవరకొండ కొత్త చిత్రం అక్టోబర్ 11న ప్రారంభం కానుంది. ఈ మూవీని దర్శకుడు రవికిరణ్ కోల తెరకెక్కించనున్నారు. గతంలో రవికిరణ్ డైరెక్ట్ చేసిన 'రాజా వారు రాణి గారు' సినిమా క్లాసిక్ లవ్ స్టోరీగా ప్రేక్షకులను మెప్పించింది. అయితే, ఇప్పుడు యాక్షన్ సినిమా కోసం ఆయన పనిచేయనున్నారు. ఈ మూవీకి 'రౌడీ జనార్ధన' అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్లు సమాచారం. అక్టోబర్ 16 నుంచే ముంబైలో షూటింగ్ ప్రారంభం కానున్నట్లు టాక్. %ూఎఙ% బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో దిల్ రాజు ఈ మూవీని నిర్మిస్తున్నారు. 2026లో ఈ మూవీ విడుదల కానుంది. ఇందులో హీరోయిన్‌గా కీర్తి సురేష్ నటించనున్నట్లు తెలుస్తుంది.

## 'కాకతీయ మెస్‌లో ఫ్రై.. సుబ్బయ్య హొటల్లో పప్పు'.. ఫుల్ ఫన్నీగా ఫంకీ టీజర్



యంగ్ హీరో విశ్వక్ సేన్ నటిస్తోన్న తాజా చిత్రం ఫంకీ ఈ మూవీకి జాతిరత్నాలు' సినిమాతో బోలెడంత క్రేజ్ తెచ్చుకున్న అనుదీప్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో కయాద్ లోహర్ హీరోయిన్‌గా కనిపించనుంది.తాజాగా రిలీజైన టీజర్ చూస్తే అనుదీప్ కామెడీ మార్క్ కనిపిస్తోంది. టీజర్ ప్రారంభంలో వచ్చే డైలాగ్‌తోనే నవ్వులు తెప్పించాడు. చిన్నప్పుడు మా అమ్మ మాటలు అస్సలు వినలేదు.. ఏం చెప్పారండి.. చెప్పాను కదా ఏం వినలేదని.. అంటూ నవ్వులు పూయించాడు. ఆ తర్వాత విశ్వక్ సేన్ పంచ్ డైలాగ్స్ అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి. నేను ఇంత పెద్ద డైరెక్టర్ అవ్వడానికి కారణం ఈ స్కూలే.. ఇక్కడ చదివాను కాబట్టే నాకు చదువుపై విరక్తి పుట్టింది.. అందుకే సినిమాల్లోకి వెళ్లా అంటూ విశ్వక్ సేన్ చెప్పిన డైలాగ్ ఫ్యాన్స్‌ను అలరిస్తోంది. కాగా.. ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వీకే నరేశ్, వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' తాజా అప్‌డేట్ .. విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చిన నిర్మాత




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు మరోసారి ఉత్సాహాన్ని కలిగించే అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇటీవల విడుదలైన చిత్రం మంచి విజయాన్ని నమోదు చేయడంతో, ఇప్పుడు అభిమానుల చూపు పూర్తిగా ఆయన తదుపరి ప్రాజెక్ట్ "ఉస్తాద్ భగత్ సింగ్ మీదే ఉంది. ఇంతకు ముందు ఈ చిత్రం 2026 మహాశివరాత్రి సందర్భంగా విడుదలవుతుందన్న వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. అయితే తాజా ఇంటర్వ్యూలో నిర్మాత రవి కిరణ్ ఈ అంశంపై స్పందిస్తూ స్పష్టతనిచ్చారు. రవి కిరణ్ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ తన భాగం షూటింగ్ పూర్తిచేశారు. దర్శకుడు హరీష్ శంకర్ రేపటి నుంచి కొత్త షెడ్యూల్ మొదలుపెడుతున్నారు. షూటింగ్‌లో ఇంకా 20 నుంచి 25 రోజుల పని మిగిలి ఉంది. ఆ తర్వాత నిర్మాణం పూర్తవుతుంది. ప్రేక్షకులకి అనుకూలంగా ఉండే డేట్‌ని చూసి మూవీని రిలీజ్ చేస్తామని రవి కిరణ్ అన్నారు.దీంతో సమ్మర్ 2026లో సినిమా థియేటర్లకు వచ్చే అవకాశం ఉన్నట్లు ట్రేడ్ వర్గాల్లో చర్చలు నడుస్తున్నాయి. అయితే నిర్మాత మాత్రం ఇంకా అధికారిక విడుదల తేదీ నిర్ణయించలేదని చెప్పారు. ఈ సినిమాను హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. గతంలో 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరూ మళ్లీ కలుస్తుండటంతో అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. ఈ మూవీకి సంగీతం దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. ఈ ముగ్గురు కాంబినేషన్‌లో సినిమా వస్తుంది అంటే మరోసారి మాస్ ఫ్యాన్స్ కి పండగే అని చెప్పాలి. చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీలీలా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ ఇద్దరూ టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉన్న నటీమణులు. బ్యూటీతో పాటు పెర్ఫామెన్స్ పరంగా కూడా ఈ చిత్రానికి వారు కీలకంగా మారనున్నారు. తాజాగా విడుదలైన %ూ+% మూవీ విజయంతో పవన్ స్టార్డమ్ మరింత పటిష్టంగా మారింది. దీని ప్రభావం 'ఉస్తాద్ భగత్ సింగ్'పైన భారీగా కనిపిస్తోంది. పవన్ పాత్ర స్టైల్, పవర్, మాస్ యాంగిల్ అన్నీ కలగలిసిన క్యారెక్టర్‌గా డిజైన్ చేశారని సమాచారం. ఈ సినిమాతోను పవన్ మరో మంచి హిట్ కొట్టడం ఖాయం అంటున్నారు.